www.udyamakeratam.com

PRGI No. : TGTEL/25/A0273

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 123 | | 24-10-2026 | | శనివారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/-

## యువశక్తితోనే శక్తిమంత భారత్!



4

- దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే మహాశక్తి యువతే: ప్రధాని మోదీ
- ఢిల్లీలో చిన్మయ అమృత మహోత్సవ ప్రపంచ సమ్మేళనం ప్రారంభం
- స్వామి చిన్మయానందతో 1993 నాటి అనుబంధాన్ని గుర్తుచేసుకున్న ప్రధాని
- గుజరాత్ సీఎంగా ఉన్నప్పటి నుంచే యువతకు ప్రాధాన్యమిచ్చానని వెల్లడి

## నేహా బోరాకు ఢిల్లీ హైకోర్టు షాక్

ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ అధ్యక్షురాలు నేహా బోరాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. నిరసనల్లో పాల్గొన్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు రూ. 10,000 వ్యక్తిగత పీస్ బాండ్ సమర్పించాలని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు అక్టోబర్ 17న జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.



4

## భారత్-చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తత

అరుణాచల్ ప్రదేశ్‌లో భారత్-చైనా వాస్తవ నియంత్రణ రేఖ వెంబడి ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయంటూ ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ సింగ్ కపూర్ చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది.



4




## రేవంత్ హడావుడి ఏడాదే

మళ్లీ కేసీఆరే సీఎం కావడం ఖాయమన్న కేటీఆర్

కాళేశ్వరంపై కాంగ్రెస్ ఉద్దేశపూర్వక కుట్ర

బీఆర్ఎస్‌పై ఆరోపణలకు బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటయ్యాయి

స్థానిక ఎన్నికలు నిర్వహించే దమ్ముందా అని సవాల్

3

# సమన్వయంతోనే నేర రహిత దక్షిణ భారతం

### నేరాల కట్టడికి రాష్ట్రాల మధ్య సమన్వయం ఎంతో కీలకం

- ఐసీసీసీ, సాంకేతికతను పంచుకునేందుకు సిద్ధం
- హైడ్రా, ఈగల్, టీజీ-సేఫ్ తో సత్ఫలితాలు
- పోలీసుల పిల్లల కోసం యంగ్ ఇండియా స్కూల్
- అమరవీరుల కుటుంబాలకు రూ.2 కోట్ల పరిహారం
- పోలీసు సమన్వయ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి



"దక్షిణ భారతదేశాన్ని అత్యంత సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని రాష్ట్రాల పోలీసుల మధ్య పటిష్టమైన సమన్వయం, సరిహద్దులు దాటి సమాచార మార్పిడి జరగడం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నేరాల నియంత్రణ కోసం అవసరమైతే తెలంగాణ పోలీసు ఆధునిక సాంకేతికతను, ఐసీసీసీ వ్యవస్థను పొరుగు రాష్ట్రాలతో పంచుకునేందుకు తమ ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. హైదరాబాద్ వేదికగా బుధవారం అట్టహాసంగా జరిగిన దక్షిణాది రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల (ఎస్ఆర్‌పీసీసీ) సదస్సును ప్రారంభించిన సందర్భంగా సీఎం ఈ మేరకు కీలక దిశానిర్దేశం చేశారు"

**హైదరాబాద్, అక్టోబర్ 23 (ఉద్యమ కెరటం):** దక్షిణ భారతదేశాన్ని అత్యంత సురక్షితమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు దక్షిణాది రాష్ట్రాలన్నీ సమన్వయంతో, సమిష్టిగా కృషి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో ఏర్పాటు చేసిన దక్షిణ ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ (ఎస్ఆర్‌పీసీసీ) సదస్సును బుధవారం ఆయన

మిగతా 2 లో

## కరువు ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి!

ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర నీటి ఎద్దడి తప్పదు

ప్రజాప్రతినిధుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

2

## తుమ్మిడిహెట్టిపై భేటీకి సిద్ధం కండి!

వివరాలు 2వ పేజీలో

## సరాక పరిశ్రమలో గ్యాస్ లీక్.. ఇద్దరి మృతి

- సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం పారిశ్రామికవాడలో ఘోర ప్రమాదం
- క్లోరోఫామ్ లీకై ఏపీకి చెందిన ఇద్దరు కార్మికుల దుర్మరణం
- ఘటనపై ఆరా తీసిన తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి
- పరిశ్రమ మూసివేతకు తక్షణ ఆదేశాలు జారీ.. విద్యుత్ కట్




సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని సరాక లేబొరేటరీస్ (సరాక రసాయన) పరిశ్రమలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గురువారం రాత్రి పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్-2లో క్లోరోఫామ్ గ్యాస్ లీకై ఇద్దరు కార్మికులు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు.

## బాధితులకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి!

మాజీ మంత్రి హరీశ్ రావు







## బయట బ్రాండ్.. లోపల కల్తీ!

ఎలుకల మలం మధ్యే మిఠాయిల తయారీ

ఆల్మండ్ హౌస్, దాదూస్‌లకు అధికారుల నోటీసులు

3

## కరువును ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ!

- ప్రభావిత మండలాల గుర్తింపు నుంచి నీటి సంరక్షణ వరకు చర్యలు
- అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలన్న డిప్యూటీ సీఎం



2



2

## పేదల ఉపాధికి ఆటంకం లేకుండా 'ఇందిరమ్మ టవర్స్'

## ఖేలో ఇండియాకు ఏర్పాట్లు

స్టేడియాల ఏర్పాటు, పోషకాహారంపై ఫోకస్

అధికారుల సమీక్షలో మంత్రి వాకిటి శ్రీహరి

వివరాలు 3లో..





## బకాయిలు విడుదల!

బీఏఎస్ ప్రైవేటు పాఠశాలలకు రూ.40.68 కోట్లు మంజూరు

4



# తుమ్మిడిహెట్టిపై భేటీకి సిద్ధం కండి!

**మహారాష్ట్ర సీఎంతో చర్చలకు నివేదికలు సిద్ధం చేయండి**

**152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి ఒప్పించాలి**

**ఏదుల రిజర్వాయర్ నుంచే డిండి, అచ్చంపేటకు జలాలు**

**ఇరిగేషన్ అధికారుల సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, అక్టోబర్ 23 (ఉద్యమ కెరటం):** తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తు పెంపు, నీటి లభ్యతపై మహారాష్ట్ర ప్రభుత్వంతో కీలక చర్చలకు సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అదే సమయంలో డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలకు ఏదుల రిజర్వాయర్ నుంచే నీటిని తరలించాలని ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 23 తర్వాత మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో జరగనున్న కీలక భేటీకి సంబంధించి పక్కా సాంకేతిక నివేదికలతో సిద్ధంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం ఆయన బోధి పెవిలియన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబులతో కలిసి ఇరిగేషన్ ప్రాజెక్టులపై విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు.

**మహారాష్ట్రను ఒప్పించేలా పక్కా నివేదికలు..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అత్యంత వెనుకబడిన అటవీ, గిరిజన ప్రాంతాల్లో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా తుమ్మిడిహెట్టిని నిర్మిస్తున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు. గిరిజనుల 'జల్ జంగిల్ జమీన్' నినాదానికి న్యాయం జరిగేలా బ్యారేజీ నిర్మాణం ఉండాలన్నారు. గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, ఆ ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీరు రాదన్నారు. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మాణానికి వారిని ఒప్పించాలన్నారు. 152 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రలో దాదాపు 2,300 ఎకరాలు, 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే వెయ్యి ఎకరాలలోపే భూమి ముంపునకు గురవుతుందని, ఎక్కడా గ్రామాలు మునిగే ప్రమాదం లేదని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. ముంపు ప్రభావాన్ని కచ్చితంగా అంచనా వేసి, మహారాష్ట్రను ఒప్పించేలా పక్కా సాంకేతిక నివేదికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఢిల్లీలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) కోరిన సమాచారాన్ని వెంటనే సమర్పించాలన్నారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలను సమర్థంగా వినిపించాలని మంత్రులకు సూచించారు.

**పాలమూరుకు ధోకా లేకుండానే డిండికి నీళ్లు..**

డిండి ప్రాజెక్టుకు 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల చొప్పున మొత్తం 0.6 టీఎంసీల నీటిని ఏదుల రిజర్వాయర్ నుంచే లిఫ్ట్ చేసేలా ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇందుకోసం శ్రీశైలం, నార్లాపూర్ నుంచి అదనపు నీటిని తెచ్చుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ నిర్ణయంతో పాలమూరు ప్రాజెక్టు నీటి వాటాకు ఎలాంటి కోత పడబోదని, దానికి ఏమాత్రం ధోకా ఉండదని స్పష్టం చేశారు. డిండికి నార్లాపూర్ నుంచి నీటిని తీసుకోవాలా లేదా ఏదుల నుంచా అన్న అంశంపై మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల ప్రతినిధుల అభ్యంతరాల నేపథ్యంలో.. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు వ్యయ అంచనాలను సీఎంకు వివరించారు. దీనిపై సుదీర్ఘ చర్చ అనంతరం ఏదుల నుంచే నీటిని లిఫ్ట్ చేయాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన పంప్ హౌస్‌లు, టన్నెళ్లు, కాల్వల సామర్థ్యం సరిపోతుందా లేదా అన్నదానిపై వెంటనే అధ్యయనం చేసి డిజైన్లు రూపొందించాలని ఇరిగేషన్ అధికారులకు సీఎం రేవంత్ సూచించారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్, సీఎంవో సెక్రటరీ మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఉపాధికి ఆటంకం లేకుండా 'ఇందిరమ్మ టవర్స్'!

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, అక్టోబర్ 23 (ఉద్యమ కెరటం):** పేదల ఉపాధికి ఎలాంటి ఆటంకం కలగకుండా వారు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే 'ఇందిరమ్మ ఇళ్ల టవర్స్' నిర్మించి ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలు, హౌసింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూనే, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి అవసరమైన భూములను యుద్ధప్రాతిపదికన గుర్తించాలని అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలోని నియోజకవర్గాల వారీగా మొదటి విడతతో పాటు, రెండు, మూడో విడతలకు అవసరమైన స్థలాలను ముందుగానే సిద్ధం చేసి ఉంచాలని కలెక్టర్లకు సూచించారు. నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. క్యూర్ పరిధిలో మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని, పేదవాడికి సొంత ఇల్లు అందించడం కంటే తమకు మరేదీ ప్రాధాన్యం కాదని స్పష్టం చేశారు. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గంలో సుమారు 500 ఇళ్ల చొప్పున నిర్మాణాలు చేపడుతున్నామని వెల్లడించారు. భూముల గుర్తింపు నుంచి నిర్మాణాల ప్రారంభం వరకు ప్రతి దశలోనూ పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. భూముల లభ్యత, స్థలాల అనుకూలతపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. హౌసింగ్ కార్పొరేషన్ రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా లబ్ధిదారుల వివరాలను నమోదు చేసి, ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా డ్రా తీయాలని స్పష్టం చేశారు. ఈ డ్రా ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం (లైవ్) చేయడంతో పాటు, ఎవరైనా ఎప్పుడైనా తమ వివరాలు చూసుకునేలా యూట్యూబ్‌లోనూ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్ కుమార్, హౌసింగ్ శాఖ కార్యదర్శి వీపీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతోనే నేర రహిత దక్షిణ భారతం!

- **గోషామహల్ పోలీసు స్మారక పరేడ్‌లో అమరులకు సీఎం ఘన నివాళి**

(మొదటి పేజీ తరువాయి..)

ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఆయా రాష్ట్రాలు తమ సొంత వనరులతో మాత్రమే నేరరహిత ప్రాంతాలుగా మారడం సాధ్యం కాదని, ఇందుకు సరిహద్దులు దాటి సమాచార మార్పిడి, సమన్వయం ఎంతో అవసరమని నొక్కిచెప్పారు. దీనికోసం తెలంగాణ అనుసరిస్తున్న అత్యుత్తమ సాంకేతిక మౌలిక సదుపాయాలు, ఐసీసీసీ వ్యవస్థను పొరుగు రాష్ట్రాలతో పంచుకునేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయన ప్రకటించారు.




**ప్రత్యేక విభాగాలతో సత్ఫలితాలు..**

రోజురోజుకూ మారుతున్న నేరాల స్వభావానికి అనుగుణంగా పోలీసు వ్యవస్థలో ఎప్పటికప్పుడు సంస్కరణలు తీసుకురావాలని సీఎం అన్నారు. రాష్ట్రంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను సమర్థంగా ఎదుర్కొనేందుకు హైడ్రా, ఈగల్, టీజీ-సేఫ్, టీజీ-టీమార్ప్ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశామని వివరించారు. అమెరికాలోని ఎఫ్‌డీఏ తరహాలో ఆహార కల్తీ, ఔషధాల నియంత్రణ కోసం టీజీ-సేఫ్‌ను ప్రారంభించామన్నారు. ఈగల్ విభాగం అద్భుత పనితీరుకు కేంద్రం నుంచి 80 శాతానికి పైగా మార్కులు రావడం, రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా మార్చడంపై ప్రధాని, కేంద్ర హోంమంత్రి ప్రత్యేకంగా అభినందించారని గుర్తుచేశారు. దేశంలోనే తొలిసారిగా ట్రాఫిక్ విభాగంలో ట్రాన్స్‌జెండర్లను అసిస్టెంట్లుగా నియమించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని ప్రస్తావించారు.

**పోలీసుల సంక్షేమానికి పెద్దపీట..**

పోలీసు వ్యవస్థకు ప్రభుత్వం సమకూర్చే వనరులను ఖర్చుగా భావించబోమని, అది పౌరుల భద్రతకు పెట్టే పెట్టుబడిగా భావిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పోలీసుల పిల్లలకు దేశంలోని అత్యుత్తమ సైనిక్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన అందించేందుకు హైదరాబాద్‌లో 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్' ఏర్పాటు చేశామన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారి వరకు.. వారి హోదాను బట్టి కనీసం రూ.కోటి నుంచి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు ఎక్స్‌గ్రేషియా, ఇంటి స్థలంతో పాటు కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కీలక సదస్సులో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, కర్ణాటక డీజీపీ డాక్టర్ ఎంఏ సలీమ్, తమిళనాడు డీజీపీ డాక్టర్ మహేష్ అగర్వాల్, పుదుచ్చేరి డీజీపీ షాలిని సింగ్, లక్షద్వీప్ ఏడీజీ బి.శంకర్ జైస్వాల్, కేరళ ఐజీ అజీతా బేగం, ఏపీ ఐజీపీ రవికృష్ణ పాల్గొన్నారు. వీరితో పాటు తెలంగాణ ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్, లా అండ్ ఆర్డర్ డీజీ మహేష్ భగవత్, సీఐడీ డీజీ చారు సిన్హా, హైదరాబాద్ సీపీ సజ్జనార్, ఆపరేషన్స్ డీజీ అనిల్ కుమార్ సహా పలు కేంద్ర దర్యాప్తు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

# కరువు ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి!

- **ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర నీటి ఎద్దడి తప్పదు**
- **ఆరుతడి పంటలే వేయాలని రైతులకు సూచన**
- **పర్యవేక్షణకు సబ్ కమిటీ, ప్రత్యేక అధికారి నియామకం**
- **ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు**
- **ప్రజాప్రతినిధుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం**

**హైదరాబాద్, అక్టోబర్ 23 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రజాభవన్‌లో కాంగ్రెస్ ముఖ్య నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల రాబోయే పది నెలల పాటు కరువు తప్పదని, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు 20 శాతం కూడా లేవని (200 టీఎంసీల కంటే తక్కువ) స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో సాగునీటి కంటే తాగునీటికే ప్రాధాన్యం ఉంటుందని, వరికి బదులు ఆరుతడి



పంటలు పండించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

**తాగునీరు, విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి..**

పెరిగిన ఉష్ణోగ్రతల వల్ల విద్యుత్ వినియోగం అనూహ్యంగా 13 వేల నుంచి 20 వేల మెగావాట్లకు చేరిందని సీఎం తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కృషితో ఇబ్బందులు లేకుండా విద్యుత్ అందిస్తున్నామన్నారు. కరువు పర్యవేక్షణకు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశామని, ఎల్‌నినో ప్రత్యేక అధికారిగా రామకృష్ణారావును నియమించామని వెల్లడించారు. తాగునీటి సమస్యల ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ తీసుకురావాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణంలో వేల కోట్ల రూపాయలు వృథా చేసిందని, ఇప్పుడు తాము ఇతర రాష్ట్రాల నుంచి బొగ్గు తెప్పిస్తూ ఆ ప్లాంట్‌ను గాడిలో పెడుతున్నామని వివరించారు.

**పట్టభద్రుల ఎన్నికల్లో సత్తా చాటాలి..**

రాబోయే మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు సామ రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిలను గెలిపించుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ దొంగదెబ్బ తీయాలని చూస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 1న ఢిల్లీలో రాహుల్ గాంధీ నిర్వహించే సభకు రాష్ట్రం నుంచి 15 వేల మంది వరకు తరలివెళ్లాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుని సంక్రాంతి నుంచి మే వరకు పల్లెల్లో కాలువలు, చెరువుల పునరుద్ధరణ పనులు చేపడతామని, పర్యవేక్షణకు ప్రత్యేక యాప్ వినియోగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# కలెక్టర్ల వద్ద నిధులు సిద్ధంగా ఉంచాలి!

**కేబినెట్ సబ్ కమిటీ భేటీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిశానిర్దేశం**

**హైదరాబాద్, అక్టోబర్ 23 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో తీవ్రమవుతున్న కరువు, ఎల్‌నినో పరిస్థితులను దీటుగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. విపత్కర పరిస్థితుల్లో సత్వర సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ల వద్ద తక్షణమే నిధులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆయన అధికారులకు కీలక సూచనలు చేశారు. కరువు, ఎల్‌నినో పరిస్థితులను సమీక్షించి నివారణ చర్యలను సిఫారసు చేసేందుకు ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం శుక్రవారం సచివాలయంలో జరిగింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తీవ్రం కాకముందే గుర్తించి, సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ప్రతి జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలు ఏవి? తలెత్తే నీటి కొరత ఎంత? వ్యవసాయ అవసరాలు ఏమిటి? అనే అంశాలను ముందే అంచనా వేసి, వాటిని దీటుగా ఎదుర్కొనేందుకు స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు నిరంతర సమన్వయంతో పనిచేయాలని, అత్యవసర పరిస్థితుల్లో కలెక్టర్లు తక్షణమే స్పందించేందుకు అవసరమైన నిధులు వారి వద్ద కచ్చితంగా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రధానంగా తాగునీటి సరఫరా, సాగునీటి అవసరాలు, పంటల రక్షణతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలకు సకాలంలో ఉపశమనం కలిగించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధానపరమైన ప్రక్రియల సాకుతో సహాయక చర్యల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలన్నారు. నీటిపారుదల, గ్రామీణ తాగునీటి సరఫరా, వ్యవసాయ శాఖలతో పాటు స్థానిక యంత్రాంగం సమన్వయంతో ముందుకెళ్లి అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ అత్యున్నత సమావేశంలో రాష్ట్రంలో వర్షపాతం లోటు, జలాశయాల్లో నీటి నిల్వలు, సాగునీటి లభ్యత, భూగర్భ జలమట్టాలు, వ్యవసాయ పరిస్థితులు, ఆయా శాఖల సన్నద్ధతపై సుదీర్ఘంగా సమీక్షించారు. జిల్లాల స్థాయిలో తాగునీటి లభ్యత, సాగునీటి అవసరాలను సమన్వయంతో పర్యవేక్షించాల్సిన అవసరంపై కూలంకషంగా చర్చించారు. రాష్ట్రంలోని 358 మండలాల్లో కరువు సంబంధిత సమస్యలు ఉన్నట్లు అధికారులు ఈ భేటీలో వివరించారు. వీటిలో 315 మండలాల్లో నిర్దేశిత కరువు అంచనా ప్రమాణాలకు సరిపడే పరిస్థితులు స్పష్టంగా ఉన్నాయని, మరో 43 మండలాల్లో పంట నష్టం ముప్పు పొంచి ఉందని వారు తెలిపారు. ఈ అదనపు 43 మండలాల్లో పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకుని, పక్కా ఆధారాలతో కూడిన వివరాలను కేంద్రానికి సమర్పించే వినతిపత్రంలో పొందుపరచడంపై సుదీర్ఘంగా చర్చించారు.

# కరువును ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ!




- **ప్రభావిత మండలాల గుర్తింపు నుంచి నీటి సంరక్షణ వరకు పటిష్ట చర్యలు**
- **తాగు, సాగునీటి సంరక్షణకు ప్రణాళికలు**
- **ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు ముందుగానే అవగాహన**
- **ఈ నెల 31లోగా కరువు మండలాల ప్రకటన.. త్వరలో అఖిలపక్ష భేటీ**
- **అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, అక్టోబర్ 23 (ఉద్యమ కెరటం):** ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో ఎదురయ్యే కరువును ముందుగానే అంచనా వేసి తాగు, సాగునీటి లభ్యతను కాపాడటంతో పాటు విద్యుత్ సరఫరా, వ్యవసాయం, గ్రామీణ ఉపాధి వంటి కీలక రంగాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఈ నెల 31లోగా కరువు మండలాలను ప్రకటించడంతో పాటు, ఎల్‌నినో కరువు పరిస్థితులపై విస్తృతంగా చర్చించడానికి త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన అధ్యక్షతన ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తీర్మానించింది. కరువు పరిస్థితులను అధిగమించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను సమీక్షించి, ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో తొలి సమావేశం జరిగింది. ఈ భేటీకి కమిటీ సభ్యులైన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు, సంబంధిత శాఖల కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కరువు ప్రభావిత మండలాలను శాస్త్రీయంగా విశ్లేషించి నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వాటిని కరువు ప్రాంతాలుగా ప్రకటించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. కరువు ప్రభావాన్ని సాధ్యమైనంత మేర తగ్గించి, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు సకాలంలో అందించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇప్పటికే కరువు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు, 20 శాతానికి మించి కరువు ప్రభావం ఉన్న మండలాల పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకుని పరిశీలించాలన్నారు. కరువు ప్రభావం వివిధ రంగాలపై ఎలా ఉండబోతోందో ముందుగానే అంచనా వేస్తే.. ప్రజలకు అవసరమైన సహాయాన్ని సకాలంలో అందించేందుకు వీలవుతుందని ఆయన చెప్పారు. ప్రతి శాఖ తమ పరిధిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. తాగు, సాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను అత్యంత జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వాడుకోవాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆయా శాఖలు సర్వసన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన సేవలు నిరంతరాయంగా అందించేందుకు అన్ని శాఖలు తమ అవసరాలను ముందుగానే అంచనా వేయాలని దిశానిర్దేశం చేశారు.

# సరాక పరిశ్రమలో గ్యాస్ లీక్.. ఇద్దరి మృతి!

- సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం పారిశ్రామికవాడలో ఘోర ప్రమాదం
- క్లోరోఫామ్ లీకై ఏపీకి చెందిన ఇద్దరు కార్మికుల దుర్మరణం
- ఘటనపై ఆరా తీసిన తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి
- పరిశ్రమ మూసివేతకు తక్షణ ఆదేశాలు జారీ.. విద్యుత్ కట్




**సంగారెడ్డి, అక్టోబర్ 23 (ఉద్యమ కెరటం):** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని సరాక లేబొరేటరీస్ (సరాక రసాయన) పరిశ్రమలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గురువారం రాత్రి పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్-2లో క్లోరోఫామ్ గ్యాస్ లీకై ఇద్దరు కార్మికులు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. మృతులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సుదర్శన్, బాలాజీగా పోలీసులు గుర్తించారు. ప్రమాద సమయంలో గ్యాస్ పీల్చి అపస్మారక స్థితికి చేరుకున్న వీరిద్దరినీ వెంటనే స్థానిక నారాయణ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే వారు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న జిన్నారం పోలీసులు హుటాహుటిన పరిశ్రమ వద్దకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, యాజమాన్యం పూర్తి నిర్లక్ష్యం వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగిందని స్థానికులు, కార్మిక సంఘాల నేతలు తీవ్ర స్థాయిలో ఆరోపిస్తున్నారు.

### తక్షణమే సీజ్ చేసిన పీసీబీ..

కార్మికుల మృతి ఘటనపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) తీవ్రంగా స్పందించింది. శుక్రవారం అధికారులు పరిశ్రమను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జనరల్ మేనేజర్ మధు, డిప్యూటీ జనరల్ మేనేజర్ యోగేశ్వర్ రావులను విచారించి వివరాలు తెలుసుకున్నారు. మొదటి అంతస్తులో ఉన్న రియాక్టర్ నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌లోని రిసీవర్‌కు క్లోరోఫామ్‌ను బదిలీ చేసే ప్రక్రియలో, లేయర్ సెపరేషన్ జరుగుతున్న సమయంలో ఈ లీకేజీ జరిగినట్లు వారు పీసీబీ అధికారులకు వివరించారు. లీకైన క్లోరోఫామ్ క్షణాల్లో ఆ ప్రాంతమంతటా వ్యాపించి ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ ఘటన తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు.. ముందస్తు విచారణ అవకాశం కూడా కల్పించకుండానే సరాక లేబొరేటరీస్ మూసివేతకు సంచలన ఆదేశాలు జారీ చేశారు. అలాగే పరిశ్రమకు తక్షణమే విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని సంగారెడ్డి పరిధిలోని తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎస్పీడీసీఎల్) అధికారులను ఆదేశించారు.

# బాధితులకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి!

**సరాక పరిశ్రమ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**కార్మికుల మృతిపై బీఆర్ఎస్ ఎల్పీ ఉప నాయకుడు హరీశ్‌రావు దిగ్భ్రాంతి**

**గత ప్రమాదాల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పాఠాలు నేర్వదా అని ప్రశ్న**

**ఫొటోలకు ఫోజులే తప్ప కార్మికులకు కల్పిస్తున్న భరోసా ఏది?**

**సిగాచి బాధితులకు సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్**



**హైదరాబాద్, అక్టోబర్ 23 (ఉద్యమ కెరటం):** జిన్నారంలోని సరాక రసాయన పరిశ్రమలో గ్యాస్ లీక్ అయి ఇద్దరు కార్మికులు మృతిచెందడం తీవ్ర విషాదకరమని బీఆర్ఎస్ ఎల్పీ ఉప నాయకుడు, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, మృతుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాడు సిగాచి.. నేడు సరాక పరిశ్రమలో ప్రమాదం జరిగిందని, గత చేదు అనుభవాల నుంచి ఈ ప్రభుత్వం ఏమీ నేర్చుకోదా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం అమాయక కార్మికుల ప్రాణాలను బలి తీసుకుంటోందని హరీశ్‌రావు మండిపడ్డారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలు ప్రశ్నార్థకంగా మారగా.. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లేకుండా పోయిందని ఆరోపించారు. ప్రమాదం జరిగిన తర్వాత వచ్చి ఫొటోలకు పోజులివ్వడం తప్ప.. కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చేస్తున్నదేమిటి అని ఆయన నిలదీశారు. కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిశ్రమల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకునేదెప్పుడని ప్రశ్నించారు. సరాక ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ప్రమాదానికి బాధ్యులైన కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పరిశ్రమల్లో భద్రతా చర్యలు పటిష్టం చేయాలని, ఉపాధి కోసం వచ్చిన అమాయక కార్మికుల ప్రాణాలకు ప్రభుత్వం భరోసా కల్పించాలని సూచించారు. ఇక గతంలో జరిగిన సిగాచి ఘటనలో 54 మంది కార్మిక కుటుంబాలకు ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించిన రూ.కోటి పరిహారాన్ని ఇప్పటికైనా అందించి మాట నిలుపుకోవాలని ఈ సందర్భంగా హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# బయట బ్రాండ్.. లోపల కల్తీ!

- ప్రముఖ స్వీట్ దుకాణాల బాగోతం బట్టబయలు
- ఎలుకల మలం మధ్యే మిఠాయిల తయారీ
- ఆల్మండ్ హౌస్, దాదూస్‌లకు అధికారుల నోటీసులు




**హైదరాబాద్, అక్టోబర్ 23 (ఉద్యమ కెరటం):** ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వ్యాపారులపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని టీజీ సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతి తీవ్రస్థాయిలో హెచ్చరించారు. రంగురంగుల ప్యాకింగ్‌లు, కళ్లు చెదిరే అలంకరణలతో ఆకర్షిస్తున్న పలు ప్రముఖ స్వీట్ షాపుల అసలు రంగు బట్టబయలైంది. శుక్రవారం హైదరాబాద్ పరిధిలోని 21 మిఠాయి, కోవా తయారీ కేంద్రాలపై టీజీ సేఫ్ విభాగానికి చెందిన 11 ప్రత్యేక బృందాలు ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించాయి. తీవ్రమైన అపరిశుభ్రత, కల్తీకి పాల్పడుతున్న చందానగర్‌లోని బి.బిచ్చారెడ్డి స్వీట్స్, మాసబ్‌ట్యాంక్ పరిధిలోని మధుర్ స్వీట్స్, కూకట్‌పల్లిలోని వాసిరెడ్డి స్వగృహ ఫుడ్స్ యాజమాన్యాల లైసెన్సులను తక్షణమే రద్దు చేశారు. ఆయా దుకాణాల వ్యాపార కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయాలని అధికారులు ఆదేశించారు. కనీస అనుమతులు కూడా లేకుండా నడుపుతున్న తార్నాకలోని సుదర్శన్ రెడ్డి ప్యూర్ ఘీ స్వీట్స్ దుకాణాన్ని వెంటనే మూసివేయించారు.

### ఎలుకల మలం.. బొద్దింకల మధ్యే..

పేరుగొప్ప దుకాణాల్లోని వంటశాలలను చూసి అధికారులే విస్తుపోయారు. చందానగర్ బిచ్చారెడ్డి స్వీట్స్ వంటగదిలో నేలపై ఎలుకల మలం, గోడలకు బూజు ఉండటంతో పాటు సరైన వివరాలు లేని రూ.2,12,850 విలువైన 330 కిలోల కల్తీ నెయ్యిని సీజ్ చేశారు. మాసబ్‌ట్యాంక్ మధుర్ స్వీట్స్‌లో బొద్దింకలు, పురుగుల మధ్యే మిఠాయిలు ఉంచడం, ప్రమాదకరమైన రోజ్ వాటర్ వాడుతుండటంతో రూ.5,63,000 విలువ చేసే 705 కిలోల ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఇక కూకట్‌పల్లి వాసిరెడ్డి స్వగృహ ఫుడ్స్ పచ్చళ్లలో ఫంగస్, బొద్దింకలు కనిపించాయి. సుదర్శన్ రెడ్డి స్వీట్స్‌లో పురుగులు పట్టిన స్వీట్లు, కాలం చెల్లిన పదార్థాలు లభ్యమయ్యాయి. దాడుల్లో మొత్తం రూ.7,75,850 విలువైన 1,035 కిలోల ఆహార పదార్థాలను సీజ్ చేసి 21 నమూనాలను సేకరించారు.

### ప్రముఖ సంస్థలకు నోటీసులు..

నిబంధనలు ఉల్లంఘించిన కూకట్‌పల్లి ఆల్మండ్ హౌస్, దాదూస్ మిఠాయి వాటిక, శ్రీనగర్ కాలనీ హర్ష ఎంటర్‌ప్రైజెస్, నల్లకుంట రాజీవ్ రెడ్డి స్వీట్స్, యూసుఫ్‌గూడ పరుచూరి ఫుడ్స్, గుండ్లపోచంపల్లి హనీ ఫుడ్స్, తార్నాక సుదర్శన్ రెడ్డి స్వీట్స్‌కు భారీ జరిమానాలు విధించేలా షోకాజ్ నోటీసులు ఇచ్చారు. బంజారాహిల్స్ మీఠే మియా, టోలిచౌకి మెజెస్టిక్ స్వీట్స్, జీడిమెట్ల శివనాగిరెడ్డి స్వీట్స్, వెంగళరావు నగర్ గోదావరి వంటిళ్లు, ఇందిరా పార్క్ శుభం హోమ్ ఫుడ్స్, ఎస్సార్ నగర్ అభిరుచి స్వగృహ, కాచిగూడ బాలాజీ రతన్‌లాల్, ప్రమదాస్ స్వీట్స్ దుకాణాల్లో లోపాలు సరిదిద్దుకోవాలని నోటీసులు జారీ చేశారు.

# రేవంత్ హడావుడి ఏడాది మాత్రమే!

**మళ్లీ కేసీఆరే సీఎం కావడం ఖాయమన్న కేటీఆర్**

**కాళేశ్వరంపై కాంగ్రెస్ ఉద్దేశపూర్వక కుట్ర**

**బీఆర్ఎస్‌పై ఆరోపణలకు బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటయ్యాయి**

**స్థానిక ఎన్నికలు నిర్వహించే దమ్ముందా అని సవాల్**



**హైదరాబాద్, అక్టోబర్ 23 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని పాలనతో అన్ని వర్గాల ప్రజలు గోస పడుతున్నారని, ఈ లూటీ పాలన చూసి మళ్లీ కేసీఆరే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన అంబర్‌పేట బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కరెంట్ లేక, తాగు, సాగు నీరు అందక వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఎల్‌నినో వస్తుందని పది నెలల ముందే చెప్పినా కాంగ్రెస్ సర్కార్ మేల్కోలేదన్నారు. దిగువ రాష్ట్రాలు ప్రాజెక్టులు నింపుకున్నా.. తెలివిలేని రేవంత్ రెడ్డి మాత్రం కాళేశ్వరం పంపులు ఆన్ చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే కుట్రతోనే ప్రాజెక్టులను నింపలేదని మండిపడ్డారు. మేడిగడ్డను కాంగ్రెస్ నేతలే కూల్చారని, ఆ తర్వాత రాహుల్ గాంధీని తీసుకొచ్చి అబద్ధాలు చెప్పించారని ఆరోపించారు.

### రాహుల్‌కు ఎన్ని జాకీలు పెట్టినా లేవడు..

దేశంలో కాంగ్రెస్ విఫలం కావడం వల్లే బీజేపీపై యువత పోరాడుతోందని కేటీఆర్ అన్నారు. రాహుల్ గాంధీకి ఎన్ని జాకీలు పెట్టినా ఆయన లేవడం లేదని ఎద్దేవా చేశారు. పిచ్చోడి చేతిలో రాయిలా రాష్ట్ర పాలన సాగుతోందని, మరో ఏడాది మాత్రమే రేవంత్ హడావుడి ఉంటుందని, ఆ తర్వాత మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. తెలంగాణ ప్రయోజనాలు గాలికొదిలేసి కేసీఆర్‌ను తిట్టేందుకు రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఒక్కటయ్యారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి దున్నపోతు ఈనిందంటే.. కిషన్ రెడ్డి దూడను కట్టేయమంటారని ఆయన చురకలంటించారు. రాజకీయ నేతలను బీజేపీ బెదిరించగలదేమో కానీ.. యువతరాన్ని కాదని స్పష్టమైందన్నారు. త్వరలోనే దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకం కాబోతున్నారని, కాంగ్రెస్-బీజేపీయేతర కూటమే భవిష్యత్తు అని ఆయన స్పష్టం చేశారు.

### ఎన్నికలు పెట్టే దమ్ముందా?

రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కార్పొరేషన్ ఎన్నికలు పెట్టే దమ్ము రేవంత్ రెడ్డికి లేదని కేటీఆర్ సవాల్ విసిరారు. ఒకవేళ కార్పొరేషన్ ఎన్నికలు పెడితే 2017 తరహాలో సెంచరీ కొట్టి బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తలు ఓటరు నమోదు నుంచి పోలింగ్ దాకా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం ధనబలాన్నే నమ్ముకుందని ఆరోపించారు. యూత్ డిక్లరేషన్ పేరుతో దారుణంగా మోసం చేసిన కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యార్థులు, నిరుద్యోగులు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు




# ఖేలో ఇండియాకు సర్వం సిద్ధం చేయాలి!

**డిసెంబర్ 11 నుంచి 22 వరకు క్రీడలు**

**గ్రామీణ ప్రతిభ వెలికితీతకే ప్రాధాన్యం**

**స్టేడియాల ఏర్పాటు, పోషకాహారంపై ఫోకస్**

**అధికారుల సమీక్షలో మంత్రి వాకిటి శ్రీహరి**

**హైదరాబాద్, అక్టోబర్ 23 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతం చేయాలని క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో క్రీడల ఏర్పాట్లు, స్టేడియాల సన్నద్ధతపై ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. దేశవ్యాప్తంగా వచ్చే క్రీడాకారులు, కోచ్‌లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.

### పారదర్శకంగా ఎంపిక..

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసి జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. మొత్తం 27 క్రీడాంశాల్లో పారదర్శకంగా క్రీడాకారులను ఎంపిక చేయాలని సూచించారు. కేవలం పోటీల నిర్వహణకే పరిమితం కాకుండా, మన రాష్ట్ర క్రీడాకారులు పతకాలు సాధించేలా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలన్నారు.

### పోషకాహారం, వసతి కల్పన..

క్రీడా వేదికలు, స్టేడియాల్లో మౌలిక సదుపాయాలను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. క్రీడాకారులకు పోషకాలతో కూడిన ఆహారం, నాణ్యమైన శిక్షణ, వైద్యం, వసతి, రవాణా సదుపాయాలు కల్పించాలన్నారు. ఖేలో ఇండియా నిర్వహణ దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోని బాలాదేవి, ఒలింపిక్ సంఘం కార్యదర్శి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ బకాయిలు విడుదల

**నిధుల విడుదలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవ**

**హైదరాబాద్, అక్టోబర్ 23 (ఉద్యమ కెరటం):** ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్య, వసతి అందిస్తున్న 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బీఏఎస్)' పథకానికి రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఈ పథకం కింద విద్యార్థులకు చదువు చెబుతున్న రాష్ట్రంలోని 225 కు పైగా ప్రైవేటు పాఠశాలలకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.40.68 కోట్ల బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సహకారంతో ఈ నిధులు విడుదలయ్యాయి.

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న బీఏఎస్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 32 వేల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో విద్యను అభ్యసించడంతో పాటు వసతి పొందుతున్నారు. వీరికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడటంతో పాటు పాఠశాలలకు చెల్లించాల్సిన బకాయిల పరిష్కారానికి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవ చూపారు. పాఠశాలల యాజమాన్యాల సమస్యలను ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పెండింగ్ బకాయిలు త్వరితగతిన విడుదలయ్యేలా చేశారు. తాజా నిర్ణయంతో విద్యార్థుల విద్యాభ్యాసానికి మరింత స్థిరత్వం చేకూరడంతో పాటు, పథకం అమలులో భాగస్వాములైన ప్రైవేటు పాఠశాలలకు ఆర్థికంగా ఊరట లభించనుంది.

# కనకధారపై ఈడీ దాడులు!

**హైదరాబాద్, అక్టోబర్ 23 (ఉద్యమ కెరటం):** బ్యాంకుల కన్సార్టియంను మోసగించి ఏకంగా రూ.326.49 కోట్ల నిధులను దారిమళ్లించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కనకధార వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కొరడా ఝుళిపించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి పరిధిలో శుక్రవారం ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో ముమ్మర తనిఖీలు చేపట్టింది. కంపెనీ రిజిస్టర్డ్ కార్యాలయం, డైరెక్టర్ల నివాసాలతో పాటు నిధుల మళ్లింపులో మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు అనుమానిస్తున్న సంస్థలు, వ్యక్తులకు చెందిన ప్రాంగణాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు ఫిర్యాదు మేరకు సీబీఐ బెంగళూరు విభాగం 2022 డిసెంబర్ 8న నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ దర్యాప్తు చేపట్టింది. ఐపీసీ సెక్షన్లు 120-బి, 420, 468, 471 తో పాటు అవినీతి నిరోధక చట్టం కింద నమోదైన కేసులో మనీలాండరింగ్ కోణాన్ని అధికారులు లోతుగా పరిశీలిస్తున్నారు.

### నకిలీ పత్రాలతో నిధుల మళ్లింపు..

పంజాబ్ నేషనల్ బ్యాంకు నేతృత్వంలోని ఐడీబీఐ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడాలతో కూడిన కన్సార్టియం నుంచి ఈ కంపెనీ భారీగా రుణ సౌకర్యాలు పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బ్యాంక్ గ్యారెంటీలు, లెటర్ ఆఫ్ క్రెడిట్ సదుపాయాలను దుర్వినియోగం చేసి నిధులను మళ్లించినట్లు ఆరోపణలున్నాయి. నకిలీ ఉక్కు కొనుగోలు ఇన్‌వాయిస్‌లు, రవాణా పత్రాలు సృష్టించి బినామీ సంస్థల ద్వారా డబ్బును ఇతర ఖాతాలకు తరలించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. కన్సార్టియం బ్యాంకులకు తెలియకుండా ఇతర బ్యాంకుల్లో సైతం గుట్టుచప్పుడు కాకుండా ఖాతాలు నిర్వహించినట్లు ఆధారాలు సేకరించారు. తాజాగా జరిగిన సోదాల్లో నిధుల మళ్లింపు, లేయరింగ్‌కు సంబంధించిన పత్రాలు, డిజిటల్ పరికరాలు, ఇతర కీలక రికార్డులను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సంస్థకు చెందిన పలు స్థిరాస్తులు, పెట్టుబడులను గుర్తించి వాటి వివరాలను నమోదు చేశారు. ఈ మోసం కేసులో మరిన్ని ఆధారాల సేకరణ కోసం ఈడీ తన దర్యాప్తును ముమ్మరంగా కొనసాగిస్తోంది.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శనివారం
24 అక్టోబర్ 2026

## సంపాదకీయం



# భారత్‌పై సైబర్ దాడుల ముప్పు!

### ఏఐతో మరింత ప్రమాదకరంగా మారుతున్న సైబర్ నేరాలు

### ప్రపంచంలో సైబర్ దాడుల లక్ష్యంగా భారత్‌కు ఏడో స్థానం

### ఆసియా దేశాల్లో మూడో స్థానంలో భారత్

కృత్రిమ మేధ సాంకేతికత వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భారత్‌కు సైబర్ దాడుల ముప్పు మరింత పెరుగుతోందని మైక్రోసాఫ్ట్ కృత్రిమ మేధ, సైబర్ భద్రతా విధానాల విభాగం డైరెక్టర్ నికొలస్ బట్స్ హెచ్చరించారు. కృత్రిమ మేధ ఆధారిత సైబర్ దాడులు భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదం మాత్రమే కాదని, ఇప్పటికే వాస్తవ రూపం దాల్చాయని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్న దేశాల్లో భారత్ ఏడో స్థానంలో ఉండగా, ఆసియా దేశాల్లో మూడో స్థానంలో ఉందని వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు, సాంకేతిక వ్యవస్థల నిర్వాహకులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

### కృత్రిమ మేధతో కొత్త తరహా దాడులు

సైబర్ నేరగాళ్లు ఇప్పటికే కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగిస్తున్నారని నికొలస్ బట్స్ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ దాడుల స్వరూపం కూడా మారుతోందన్నారు. గతంలో సాధారణ పద్ధతుల్లో జరిగే మోసాలు ఇప్పుడు మరింత అధునాతనంగా మారుతున్నాయని పేర్కొన్నారు. కృత్రిమ మేధ సహాయంతో సైబర్ నేరగాళ్లు తమ దాడులను వేగవంతం చేయడంతోపాటు మరింత నమ్మదగిన రీతిలో మోసపూరిత సందేశాలను రూపొందించే అవకాశాలు పెరుగుతున్నాయని వివరించారు. ఈ పరిణామాలు ప్రభుత్వాలు, సంస్థల సైబర్ భద్రతా వ్యవస్థలకు కొత్త సవాళ్లను విసురుతున్నాయని అభిప్రాయపడ్డారు.

### రోజుకు 165 లక్షల కోట్ల సంకేతాల విశ్లేషణ

ప్రపంచవ్యాప్తంగా సైబర్ ముప్పు ఏ స్థాయిలో ఉందో అంచనా వేసేందుకు మైక్రోసాఫ్ట్‌కు విస్తృతమైన సమాచార వ్యవస్థ అందుబాటులో ఉందని నికొలస్ బట్స్ వెల్లడించారు. ప్రతిరోజూ దాదాపు 165 ట్రిలియన్ల భద్రతా సంబంధిత టెలీమెట్రీ సంకేతాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అంటే రోజుకు సుమారు 165 లక్షల కోట్ల సంకేతాలను విశ్లేషిస్తూ అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తిస్తున్నామని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ సాంకేతిక వ్యవస్థల నుంచి అందుతున్న సమాచారాన్ని పరిశీలించడం ద్వారా సైబర్ దాడుల ధోరణులను గుర్తించగలుగుతున్నామని పేర్కొన్నారు.

### 500 కోట్ల ఈమెయిళ్లపై నిఘా

సైబర్ దాడులను అడ్డుకునేందుకు ప్రతిరోజూ సుమారు 500 కోట్ల ఈమెయిళ్లను పరిశీలిస్తున్నట్లు నికొలస్ బట్స్ తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రమాదకరమైన సందేశాలు, అనుమానాస్పద లింకులు, హానికరమైన సాఫ్ట్‌వేర్‌ను వ్యాప్తి చేసే ప్రయత్నాలను గుర్తిస్తున్నామని వివరించారు. రోజుకు దాదాపు 50 లక్షల మాల్‌వేర్ దాడులను అడ్డుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ గణాంకాలే ప్రపంచవ్యాప్తంగా సైబర్ ముప్పు తీవ్రతను తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. డిజిటల్ వ్యవస్థల వినియోగం పెరుగుతున్న కొద్దీ వాటి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం కూడా పెరుగుతోందన్నారు.

### ఈమెయిళ్లు, ఫిషింగ్‌తో పెరుగుతున్న ప్రమాదం

సైబర్ నేరగాళ్లు దాడులకు ఈమెయిళ్లను ప్రధాన సాధనంగా వినియోగిస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఫిషింగ్ పేరుతో నకిలీ సందేశాలు పంపించి వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డులు, బ్యాంకు ఖాతాల వివరాలను దొంగిలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. విశ్వసనీయ సంస్థల పేర్లతో వచ్చే నకిలీ ఈమెయిళ్లు, అనుమానాస్పద లింకులు, మోసపూరిత సందేశాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. కృత్రిమ మేధ సాంకేతికతతో ఇటువంటి సందేశాలను మరింత సహజంగా రూపొందించే అవకాశముండటంతో మోసాలను గుర్తించడం కష్టతరమవుతుందని వివరిస్తున్నారు.

### సైబర్ భద్రతకు సమాచారమే ప్రధాన ఆయుధం

సైబర్ ముప్పును ముందుగానే గుర్తించి అడ్డుకోవడంలో సమాచార విశ్లేషణ అత్యంత కీలకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడం, దాడుల నమూనాలను విశ్లేషించడం, భద్రతా వ్యవస్థలను ఎప్పటికప్పుడు నవీకరించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని సూచిస్తున్నారు. సైబర్ భద్రతా బృందాలకు సమగ్ర సమాచారం ప్రధాన రక్షణ సాధనంగా మారిందని పేర్కొంటున్నారు. సాంకేతిక వ్యవస్థల రక్షణకు ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తున్నారు.

**డిజిటల్ సేవల వినియోగం విస్తరిస్తున్న భారత్ వంటి దేశాల్లో సైబర్ భద్రతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నికొలస్ బట్స్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ విభాగాలు, ఆర్థిక సంస్థలు, వ్యాపార సంస్థలు తమ సమాచార వ్యవస్థలకు పటిష్ఠమైన రక్షణ కల్పించడంతోపాటు సిబ్బందికి సైబర్ భద్రతపై అవగాహన పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రజలు కూడా అనుమానాస్పద సందేశాలను నమ్మకుండా, తెలియని లింకులను తెరవకుండా, ఖాతాలకు బలమైన పాస్‌వర్డులు, అదనపు ధ్రువీకరణ విధానాలను ఉపయోగించాలని చెబుతున్నారు. కృత్రిమ మేధతో సైబర్ నేరాలు కొత్త రూపు సంతరించుకుంటున్న తరుణంలో ముందస్తు అప్రమత్తత, ఆధునిక భద్రతా చర్యలే కీలకమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.**

# యువశక్తితోనే శక్తిమంతమైన భారత్!

- దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే మహాశక్తి యువతే: ప్రధాని మోదీ
- ఢిల్లీలో చిన్మయ అమృత మహోత్సవ ప్రపంచ సమ్మేళనం ప్రారంభం
- స్వామి చిన్మయానందతో 1993 నాటి అనుబంధాన్ని గుర్తుచేసుకున్న ప్రధాని
- గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచే యువతకు ప్రాధాన్యమిచ్చానని వెల్లడి
- 300 రోజుల్లో 40 వేల కిలోమీటర్లు ప్రయాణించిన యువతకు ప్రశంసలు
- భారత నాగరికత, ఆధ్యాత్మిక విలువలను కాపాడుకోవాలని పిలుపు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 23 (ఉద్యమ కెరటం):** యువశక్తిని సమర్థంగా వినియోగించుకోవడం ద్వారానే శక్తిమంతమైన, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించవచ్చని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర అత్యంత కీలకమని, వారి ప్రతిభ, సామర్థ్యాలు, సృజనాత్మకతను దేశాభివృద్ధికి అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలోని భారత్ మండపంలో చిన్మయ అమృత మహోత్సవ ప్రపంచ సమ్మేళనాన్ని ప్రధాని ప్రారంభించారు. చిన్మయ మిషన్ 75 ఏళ్ల ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ సమ్మేళనం అక్టోబర్ 25 వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ భారతదేశ ఆధ్యాత్మిక వారసత్వం, యువత ప్రాధాన్యం, దేశ నిర్మాణంలో వారి భాగస్వామ్యంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆధ్యాత్మిక గురువు స్వామి చిన్మయానందతో తనకు ఉన్న అనుబంధాన్ని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. 1993లో స్వామి చిన్మయానందతో జరిగిన చివరి సమావేశం తన జీవితంలో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. ఆ సమావేశంలో దేశాభివృద్ధిలో యువత పాత్ర, యువశక్తిని సద్వినియోగం చేసుకోవడం, యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం వంటి అంశాలపై ప్రధానంగా చర్చించినట్లు వెల్లడించారు. స్వామి చిన్మయానంద ఆలోచనలు తనపై ఎంతో ప్రభావం చూపాయని వివరించారు. దేశాన్ని ముందుకు నడిపించే శక్తి యువతలోనే ఉందనే విషయాన్ని ఆయన అప్పట్లోనే స్పష్టంగా చెప్పారని గుర్తుచేసుకున్నారు. స్వామి చిన్మయానందతో సమావేశమైన కొన్నేళ్ల అనంతరం గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవ చేసే అవకాశం తనకు లభించిందని మోదీ తెలిపారు. అప్పటి నుంచి ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో యువతను కేంద్ర బిందువుగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. యువతకు అవకాశాలు కల్పించడం, వారి ప్రతిభను ప్రోత్సహించడం, దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయడం ద్వారా భారతదేశాన్ని మరింత బలోపేతం చేయవచ్చని అభిప్రాయపడ్డారు. యువతలోని శక్తిని సరైన దిశలో నడిపిస్తే దేశం అసాధారణ విజయాలను సాధించగలదని ఉద్ఘాటించారు. 1993లో చికాగోలో జరిగిన ప్రపంచ మతాల పార్లమెంట్ శతాబ్ది ఉత్సవాలకు హాజరుకావాలని స్వామి చిన్మయానందను తాను ఆహ్వానించిన విషయాన్ని కూడా ప్రధాని గుర్తుచేసుకున్నారు. ఆ ఆహ్వానాన్ని స్వామి చిన్మయానంద అంగీకరించారని తెలిపారు. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడంలో స్వామి చిన్మయానంద విశేష కృషి చేశారని కొనియాడారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక చింతనను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడంలో ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

### చిన్మయ మిషన్ ఒక ఆధ్యాత్మిక తత్వం

చిన్మయ మిషన్ కేవలం ఒక సాధారణ సంస్థ కాదని, భారతీయ సనాతన ఆధ్యాత్మిక తత్వానికి ప్రతిరూపమని ప్రధాని మోదీ అభివర్ణించారు. భారతదేశానికి ప్రపంచంలో ప్రత్యేకమైన గుర్తింపు రావడానికి దాని నాగరికతా మూలాలు, సాంస్కృతిక వారసత్వమే ప్రధాన కారణమన్నారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలు తరతరాలుగా సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఆధునిక అభివృద్ధిని సాధిస్తూనే దేశ నాగరికతా మూలాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలు ప్రపంచానికి మానవతా విలువలను అందిస్తున్నాయని పేర్కొన్నారు. చిన్మయ అమృత మహోత్సవ వేడుకల్లో భాగంగా దేశవ్యాప్తంగా పర్యటించిన యువతీయువకుల బృందాన్ని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. సుమారు 300 రోజులపాటు 40 వేల కిలోమీటర్లు ప్రయాణించి లక్షలాది మందిని కలుసుకోవడం విశేషమైన కృషి అని ప్రశంసించారు. భారతీయ ఆధ్యాత్మిక విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువత చూపిన అంకితభావం అభినందనీయమన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శిస్తూ ప్రజలతో మమేకం కావడం ద్వారా యువత సమాజంతో మరింత అనుబంధాన్ని పెంపొందించుకుందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో సేవాభావాన్ని, సామాజిక బాధ్యతను పెంచుతాయని అభిప్రాయపడ్డారు.

### వేదాంత జ్ఞాన వ్యాప్తికి 75 ఏళ్ల సేవలు

వేదాంత తత్వాన్ని, భగవద్గీత బోధనలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో స్వామి చిన్మయానంద 1951లో చిన్మయ మిషన్‌ను ప్రారంభించారు. భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చేయడంలో ఈ సంస్థ విశేష కృషి చేస్తోంది. ఆధ్యాత్మిక బోధనలతోపాటు విద్య, సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక విలువల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తోంది. చిన్మయ మిషన్ 75 ఏళ్ల ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ప్రపంచ సమ్మేళనం భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని మరోసారి గుర్తుచేసే వేదికగా నిలిచింది. దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించాలన్న సందేశంతో ప్రధాని మోదీ ప్రసంగం సాగింది.




# మీ సైనికుల మృతదేహాలకు మేమే అంత్యక్రియలు చేశాం

### ఐరాసలో పాక్‌కు భారత్ చురకలు!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 23:** అంతర్జాతీయ వేదికపై భారత్‌పై నిందలు వేయాలని కుట్ర పన్నిన పాకిస్థాన్‌కు ఐక్యరాజ్యసమితిలో మరోసారి తీవ్ర భంగపాటు ఎదురైంది. ఐరాస సమావేశంలో జమ్మూకశ్మీర్ అంశాన్ని అనవసరంగా ప్రస్తావించిన దాయాది దేశానికి భారత ప్రతినిధి గట్టిగా బుద్ధి చెప్పారు. ఐరాస సమావేశంలో పాకిస్థాన్ రాయబారి జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తగా.. భారత శాశ్వత మిషన్ తొలి కార్యదర్శి భావికా మంగళానందన్ దానిని తీవ్రంగా ఖండించారు. జమ్మూకశ్మీర్ పూర్తిగా భారత్ అంతర్గత విషయమని, దాని గురించి మాట్లాడే ఎలాంటి నైతిక హక్కు పాకిస్థాన్‌కు లేదని స్పష్టం చేశారు. కశ్మీర్‌పై ప్రదర్శించే దొంగ శ్రద్ధను పాక్ ఆక్రమణలోని ప్రాంతాల్లో ఉన్న మైనార్టీల రక్షణపై పెట్టాలని సూచించారు. అక్కడ అనేకమంది మైనారిటీలు కనుమరుగవుతున్నారని, నిరంతరం వారి ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరుగుతోందని పేర్కొంటూ మొదట ఆ సమస్యలను పరిష్కరించుకోవాలని హితవు పలికారు. 'అసాధారణ పరిస్థితులలో అంత్యక్రియల హక్కులు.. మత విశ్వాసాలు' అనే అంశంపై జరిగిన చర్చలో భావికా మంగళానందన్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 1999లో కార్గిల్ యుద్ధంలో మరణించిన సొంత సైనికుల మృతదేహాలను కూడా స్వీకరించడానికి నిరాకరించిన దేశం.. విశ్వాసం, మత స్వేచ్ఛ, ఖననాల గురించి మాట్లాడటం ఎంతో విడ్డూరంగా ఉందన్నారు. పాక్ ప్రభుత్వం తమ సైనికుల మృతదేహాలను దయనీయ పరిస్థితుల్లో సరిహద్దుల్లో వదిలేసిన సమయంలో.. ఆ మృతదేహాలకు భారత సైన్యమే పూర్తి సైనిక లాంఛనాలతో, ఇస్లాం సంప్రదాయాల ప్రకారం గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించిందనే చారిత్రక సత్యాన్ని గుర్తుచేశారు. ఒక ఉగ్రవాది అమాయక ప్రజలను దారుణంగా చంపడమే కాకుండా, ఒక దేశ మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తాడని విమర్శించారు. అలాంటి క్రూరమైన ఉగ్రవాదుల హక్కుల కోసం ఐరాసలో ఇంత తీవ్రంగా వాదిస్తున్న పాకిస్థాన్.. ఉగ్రవాద బాధితుల హక్కులు, వారి ఆవేదన గురించి ఆలోచించకపోవడం శోచనీయమని మంగళానందన్ ఘాటుగా సమాధానమిచ్చారు.

# భారత్-చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తత

### విదేశాంగ శాఖ కీలక ప్రకటన!



**న్యూఢిల్లీ, అక్టోబర్ 23:** అరుణాచల్ ప్రదేశ్‌లో భారత్-చైనా వాస్తవ నియంత్రణ రేఖ (వాస్తవ) వెంబడి ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయంటూ ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ సింగ్ కపూర్ చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. చైనా సైనికులు గతంలో పరస్పరం అంగీకరించిన గస్తీ విధానాల నుంచి తప్పుకోవడం వల్లే సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితులు అప్పుడప్పుడు ఉద్రిక్తంగా మారుతున్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. సరిహద్దు ప్రాంతాల్లో పూర్తి శాంతి, స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి భారత్-చైనా ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధి అత్యంత ఆవశ్యకమని రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఎల్ఏసీ వెంబడి ఉత్పన్నమవుతున్న సమస్యలను సమర్థంగా పరిష్కరించుకోవడానికి, ఇరు దేశాల మధ్య ఎలాంటి అపార్థాలు, తప్పుడు అంచనాలు చోటుచేసుకోకుండా చూసేందుకు దౌత్య, సైనిక వ్యవస్థల ద్వారా చర్చలు నిరంతరం కొనసాగుతున్నాయని వివరించారు. అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా సైనికులతో ఘర్షణ వాతావరణంపై ఐటీబీపీ డీజీ చేసిన వ్యాఖ్యల గురించి మరిన్ని వివరాల కోసం రక్షణ మంత్రిత్వ శాఖను సంప్రదించాలని సూచించారు. సరిహద్దు నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు ఎల్ఏసీపై ఇరు దేశాల అవగాహనను పెంచే మార్గాలపై చర్చించేందుకు భారత్, చైనాలు అంగీకరించాయని ఆయన తెలిపారు. రాజస్థాన్‌లోని అల్వార్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఐటీబీపీ డీజీ శత్రుజీత్ సింగ్ కపూర్ మాట్లాడుతూ.. సరిహద్దుల్లో భద్రతా సామర్థ్యాలను గణనీయంగా పెంచేందుకు అన్ని సరిహద్దు యూనిట్లలో ప్రత్యేకంగా డ్రోన్ ప్లాటూన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గల్వాన్ లోయ వంటి ఘర్షణ పరిస్థితులను మరింత సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు సరికొత్త స్ట్రైక్ శిక్షణ కోర్సులను రూపొందించి బలగాలకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

# నేహా బోరాకు ఢిల్లీ హైకోర్టు షాక్

### 10 వేల పీస్ బాండ్ నోటీసుల పిటిషన్ కొట్టివేత

**న్యూఢిల్లీ, అక్టోబర్ 23:** ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ అధ్యక్షురాలు నేహా బోరాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. నిరసనల్లో పాల్గొన్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు రూ. 10,000 వ్యక్తిగత పీస్ బాండ్ సమర్పించాలని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు అక్టోబర్ 17న జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అక్రమాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ అక్టోబర్ 16న నేహా బోరా వామపక్ష విద్యార్థి సంఘాలతో కలిసి 'తిరంగా మార్చ్' నిర్వహించారు. జంతర్ మంతర్ వద్ద ఆంక్షలు అమలులో ఉన్నప్పటికీ ప్రజలను కన్నాట్‌ప్లేస్ వైపు వెళ్లేలా ఆమె ప్రేరేపించారని పోలీసులు ఆరోపించారు. కోర్టులో నేహా బోరా తరఫు న్యాయవాది వాదిస్తూ.. తాను ఎలాంటి శాంతిభద్రతలకు భంగం కలిగించలేదని, ఈ నోటీసులు ఆర్టికల్ 19, 21 కింద ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. అయితే ఢిల్లీ పోలీసుల తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ స్పందిస్తూ, నేహా బోరా నిబంధనలు ఉల్లంఘించిన 12 సందర్భాలను వివరించి, ఇవి శిక్ష కోసం కాక ముందస్తు శాంతిభద్రతల రక్షణ కోసమేనని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ మార్పు ఎన్నికల ద్వారానే జరగాలని పేర్కొంటూ హైకోర్టు పిటిషన్‌ను కొట్టివేసింది.



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక





# రైతులు ఎఫ్‌పీఓలలో చేరి ఆర్థిక ప్రయోజనాలు పొందాలి

**సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** రైతులు రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో (ఎఫ్ పీ ఓ) భాగస్వాములై ఆర్థికంగా బలోపేతం కావాలని ఆసిఫాబాద్ సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రాథమిక సహకార సంఘంలో ఎఫ్ పీ ఓ ప్రాముఖ్యతపై గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తమ సహకార సంఘాన్ని ఎఫ్ పీ ఓ గా గుర్తించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రతి డైరెక్టర్ 50 మంది రైతులను సభ్యులుగా చేర్పించాలని సూచించారు. వైస్ చైర్మన్ రుకుమ్ ప్రహ్లాద్ మాట్లాడుతూ రైతు రూ. 2,000 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే ఎన్‌సీడీసీ (ఎన్ సీ డీ సీ) ద్వారా మరో రూ. 2,000 అదనపు వాటా ధనంగా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాగ నారాయణ, రాథోడ్ శ్రీధర్, నాథో షాముల్, డైరెక్టర్లు నారా ఆశన్న, బల్లారపు మధుకర్, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

# గ్రాండ్ గా ప్రభాస్ బర్త్ డే

**అలుగునూర్ చౌరస్తాలో వేడుకలు చేసిన ఫ్యాన్స్..**

**పటాకులు కాల్చి, కేక్ కట్ చేసిన యూత్..**



**ఉద్యమ కెరటం, అలుగునూర్:** యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ బర్త్ డే వేడుకను కరీంనగర్ జిల్లా అలుగునూర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. రెబల్ స్టార్ ఫ్యాన్స్ గోపు చంద్రశేఖర్ రెడ్డి, గంగా రెబల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పటాకలు కాల్చారు. వేడుకలకు ముఖ్య అతిథిగా పొరండ్ల సింగిల్ విండో ఛైర్మన్ గోపు తిరుపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ఫ్యాన్స్ కి స్వీట్లు తినిపించారు. ఈ వేడుకలో ప్రభాస్ ఫ్యాన్స్ ద్యావ శ్రీనివాస్ రెడ్డి, కంది అశోక్ రెడ్డి, సిల్ల అనిల్, సిల్ల ప్రవీణ్, ఎలవేని శ్రావణ్, నూనె విష్ణు, ముంజ రాకేష్, ముంజ ప్రవీణ్ దాసం అజయ్, సిరిసిల్ల చందు అలుగునూర్ ఫ్యాన్స్ పాల్గొన్నారు.

# రేపు 20 కి.మీ సైకిల్ ర్యాలీ



**ఉద్యమ కెరటం, కరీంనగర్:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీ ఆదివారం రోజున కరీంనగర్ నగరంలో నిర్వహించబోయే భారీ సైకిల్ ర్యాలీకి సంబంధించిన ప్రత్యేక పోస్టర్, రూట్ మ్యాప్‌లను కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. ఆదివారం ఉదయం ఈ సైకిల్ ర్యాలీ స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి వైభవంగా ప్రారంభమవుతుందని తెలిపారు. పరేడ్ గ్రౌండ్ నుండి మొదలై బస్ స్టేషన్, ప్రతిమ మల్టీప్లెక్స్, గీతాభవన్ చౌరస్తా, మంకమ్మతోటలోని పొన్నం కాంప్లెక్స్, కెమిస్ట్ భవన్ మీదుగా సాగి, ఎలక్ట్రిసిటీ కార్యాలయం వద్ద యూ టర్న్ తీసుకుంటుందని వివరించారు. అనంతరం కోర్ట్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, నాఖా చౌరస్తా, బోట్ చౌరస్తా, కమాన్ చౌరస్తా, తిరిగి బస్టాండ్ సర్కిల్, ప్రతిమ మల్టీప్లెక్స్ మీదుగా ప్రయాణించి పరేడ్ గ్రౌండ్ వద్ద ముగుస్తుందని ఆయన తెలిపారు. ఈ సైక్లింగ్ ర్యాలీ కరీంనగర్ నగరంలో దాదాపు 20 కిలోమీటర్ల మేర సాగనుందని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో ప్రజలను భాగస్వామ్యం చేసే పవిత్ర ఉద్దేశ్యంతో అక్టోబర్ 31వ తేదీ వరకు పలు అవగాహన, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పోలీస్ కమీషనర్ తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ నిర్వహిస్తున్న ఈ వారోత్సవాలను విజయవంతం చేయడానికి నగర ప్రజలతో పాటు ముఖ్యంగా విద్యార్థి లోకం వివిధ పోటీల్లో, కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని కరీంనగర్ సీపీ గౌష్ ఆలం పిలుపునిచ్చారు.

**పోలీసులకు వ్యాసరచన పోటీలు!**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కేంద్రంలో శుక్రవారం కమీషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందికి రెండు ప్రత్యేక కేటగిరీలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలు నందు ఈ పోటీలు జరిగాయి. పోటీలలో భాగముగా పోలీస్ కానిస్టేబుల్ నుండి ఏఎస్సై స్థాయి వరకు గల సిబ్బందికి "ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుండి ఎటువంటి సేవలు ఆశిస్తారు" లేదా "పోలీసు అధికారుల జీవితాలలో సోషల్ మీడియా పాత్ర – దాని వ్యసనాన్ని అధిగమించి వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాల కోసం సద్వినియోగం చేసుకోవడం ఎలా" అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అలాగే ఎస్సై, ఆపై స్థాయి అధికారులకు "పౌరుల మన్ననలు పొందడానికి పోలీసులు చేయవలసిన కృషి" లేదా "నేల స్థాయిలో పోలీసింగ్ బలోపేతం చేయడం" అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కమీషనరేట్‌కు చెందిన అన్ని పోలీసు స్టేషన్లు, వివిధ విభాగాల నుండి మొత్తం 90 మంది పోలీస్ సిబ్బంది, అధికారులు ఈ పోటీలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పోరాటయోధుడు కొమురం భీమ్ 86వ వర్ధంతికి

# జోడేఘాట్ సిద్ధం

'జల్, జంగల్, జమీన్' నినాదంతో గిరిజనుల హక్కులు, స్వేచ్ఛ కోసం ప్రాణాలర్పించిన పోరాటయోధుడు కొమురం భీమ్ 86వ వర్ధంతి వేడుకలను ఈ నెల 26న ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ కె. హరిత, స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జోడేఘాట్‌లోని కొమురం భీమ్ మ్యూజియం సమావేశ మందిరంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందుతో కలిసి వారు వివిధ శాఖల అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు.

- 26న కొమరం భీమ్ వర్ధంతి
- సమీక్షించిన కలెక్టర్, ఎమ్మెల్యే



ఉద్యమ కెరటం, కెరమెరి: 'జల్, జంగల్, జమీన్' నినాదంతో గిరిజనుల హక్కులు, స్వేచ్ఛ కోసం ప్రాణాలర్పించిన పవిత్ర ఆదివాసీ పోరాటయోధుడు కొమురం భీమ్ 86వ వర్ధంతి వేడుకలను ఈ నెల 26న ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత, స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జోడేఘాట్‌లోని కొమురం భీమ్ మ్యూజియం సమావేశ మందిరంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందుతో కలసి వారు వివిధ శాఖల అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోడేఘాట్ ప్రాంగణంలో జరుగుతున్న తాగునీరు, రవాణా, పారిశుద్ధ్యం, వైద్యం, విద్యుత్ సరఫరా, బారికేడింగ్ పనులను వారు స్వయంగా పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వర్ధంతి వేడుకలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది గిరిజనులు, భక్తులు, ప్రజాప్రతినిధులు



తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ఆదివాసీ ఆత్మగౌరవ ప్రతీక అయిన కొమురం భీమ్ త్యాగం, ధైర్యసాహసాలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన చూపిన పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించేలా వేడుకలను సముచిత రీతిలో నిర్వహించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ మళ్లింపు, వాహనాల పార్కింగ్ వ్యవస్థను క్రమబద్ధీకరించాలని, అత్యవసర వైద్య సేవల కోసం ప్రత్యేక మెడికల్ క్యాంపులు, అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో పలువురు జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ముంజంపల్లి జాలగుట్టపై మట్టి మాఫియా కన్ను

- రాత్రి వేళల్లో జేసీబీలతో మట్టి దందా..
- ట్రాక్టర్లు, టిప్పర్లలో కరీంనగర్ తరలింపు
- చూసీచూడనట్లు అధికార యంత్రాంగం

**జాలగుట్టను తవ్వేస్తున్న అక్రమార్కులు**



**ఉద్యమ కెరటం, కరీంనగర్:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ముంజంపల్లి గ్రామ శివారులో ఉన్న జాలగుట్ట ఇప్పుడు మట్టి మాఫియా చేతిలో అడ్డంగా దోపిడీకి గురవుతోంది. ప్రభుత్వ భూమిలో ఉన్న విలువైన గుట్ట మట్టిని అక్రమార్కులు అక్రమంగా తవ్వి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**రాత్రి వేళల్లో ఆపరేషన్..**

ముంజంపల్లి గ్రామానికి చెందిన మట్టి మాఫియా ఈ దందాను రాత్రికి రాత్రే నిర్వహిస్తోంది.పగటి పూట ఎవరికీ అనుమానం రాకుండా ఉండి,చీకటి పడగానే జేసీబీలను గుట్ట వద్దకు తీసుకెళ్తున్నారు.గుట్టను లోతుగా తవ్వి,మట్టిని ట్రాక్టర్లు,టిప్పర్లలో నింపి కరీంనగర్ తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని నిర్మాణ అవసరాలకు అధిక ధరకు విక్రయిస్తున్నారు.దీంతో ప్రభుత్వానికి రావాల్సిన లక్షల రూపాయల రాయల్టీకి నష్టం వాటిల్లుతోంది.

**ప్రభుత్వ భూమే టార్గెట్..**

ముంజంపల్లి గ్రామ శివారులోని జాలగుట్ట ప్రభుత్వ భూమి కావడంతో ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టి కోసం ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు.గుట్టను ఇలాగే తవ్వేస్తే రాబోయే రోజుల్లో గుట్ట పూర్తిగా అదృశ్యమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గుట్ట తవ్వకాల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోంది, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి,వర్షం వస్తే వరద ముప్పు కూడా ఉందని అంటున్నారు.

**అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు?**

నిత్యం రాత్రి వేళల్లో భారీ శబ్దాలతో జేసీబీలు,టిప్పర్లు తిరుగుతున్నా మైనింగ్ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.మట్టి మాఫియా నుండి మామూళ్లు అందుతుండటం వల్లే చర్యలు తీసుకోవడం లేదని చర్చ జరుగుతోంది.

**అధికారులు వెంటనే స్పందించాలి**

జిల్లా కలెక్టర్,మైనింగ్ ఏడీ,రెవెన్యూ యంత్రాంగం వెంటనే స్పందించి ముంజంపల్లి జాలగుట్ట వద్ద తనిఖీలు చేపట్టి,అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలని, మట్టి మాఫియాపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# పెద్దపల్లి ఎంఐఎం పట్టణ కమిటీ నియామకం

- పట్టణ అధ్యక్షుడిగా సయ్యద్ ఉమెర్‌ను నియమించిన జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్
- ప్రజా సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ కృషి చేయాలి
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ సూచన




**ఉద్యమ కెరటం, కరీంనగర్:** ఎంఐఎం పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడిగా సయ్యద్ ఉమెర్ ను, నూతన కమిటీని నియమించినట్లు, ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు. ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు పెద్దపల్లి పట్టణ నూతన కమిటీని శుక్రవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యాలయం దారు-స్సలాంలో నియామక పత్రాన్ని, నూతన కమిటీకి అందజేసినట్లు గులాం అహ్మద్ చెప్పారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు. పెద్దపల్లి పట్టణంలో ఎంఐఎం పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు అలుపెరుగకుండా అహర్నిశలు పాటు పడాలన్నారు. ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేయాలన్నారు. పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడిగా సయ్యద్ ఉమేర్ అహ్మద్, ఉపాధ్యక్షుడుగా అడ్వకేట్ ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శిగా కలీమ్, జాయింట్ సెక్రటరీలుగా సయ్యద్ ముజాహిద్, ఇర్ఫాన్ అలీ, ఖాజా మోహినుద్దీన్, షేక్ బర్కత్, కోశాధికారిగా ముఫ్తి ఇంతియాజ్ ఖాన్ అసాధి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా షేక్ పర్వేజ్, ఇమ్రానోద్దీన్, ముజీబోద్దీన్, ఫుర్ఖాన్, ముజీబ్ ఖాన్, షోయబ్ ఖాన్ లను నియమించినట్లు, ఉమ్మడి జిల్లా గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు.

# బేకరీ షాప్ లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండల కేంద్రంలోని ఐబిలో గల బేకరీ, స్వీట్ షాప్ లలో శుక్రవారం మంచిర్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి జి.మహేష్ ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బేకరీ షాపులలోని కార్ఖానాలను తనిఖీలు చేసి నిలువ ఉన్న పదార్థాలను సేకరించి ల్యాబ్లకు పంపనున్ననట్లు తెలిపారు. ల్యాబ్ పరీక్షల నివేదికల అనంతరం బేకరీలపై తగిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారి పేర్కొన్నారు. బేకరీ నిర్వాహకులు, యజమానులు నాణ్యమైన వస్తువులను తయారుచేసి వినియోగదారులకు విక్రయించాలని సూచించారు. నిల్వ ఉంచిన, కాలం చెల్లిన తినుబండారాలను వినియోగదారులకు అమ్మితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపును ఆపాలి




**ఉద్యమ కెరటం, తాండూర్:** ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపును ఆపాలని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబి సర్వీస్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజారాం, వ్యవసాయ కార్మిక సంఘం తాండూర్ మండల అధ్యక్షులు వేల్పుల శంకర్ మాట్లాడుతూ సర్ పేరుతో 13 కోట్ల మందికి పైగా ఓట్లను ఏకపక్షంగా సిఈసి జ్ఞానేష్ కుమార్ తొలగించాడని, తక్షణమే ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సర్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, అప్పటివరకు ఈ పోరాటాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. రాస్తారోకో కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని తాండూర్ పోలీసులు జోక్యం చేసుకొని రాస్తారోకో ధర్నాను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో సువర్ణ, లీలారాణి, విజయలక్ష్మి, రాజేశ్వరి, సుజాత, తిరుమలేశ్వరి, జైనేని లక్ష్మి, కామెర బాబు, మొగిలి, బొల్లం రాజేశం, సూరి, నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

# డిజిటల్ సర్వేతో భూ రికార్డుల్లో పారదర్శకత

**జిల్లా కలెక్టర్ హరిత**



**ఉద్యమ కెరటం, కెరమెరి:** భూముల హద్దులు, భూ రికార్డులను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు డిజిటల్ సర్వే దోహద పడుతుందని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. మండలంలోని సావర్ ఖేడ గ్రామపంచాయతీ పరిధిలోని నాగపూర్ శివారు భూములకు సంబంధించి చేపడుతున్న డిజిటల్ భూ సర్వే ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించిన వివరాలు స్పష్టంగా అందుబాటులో ఉండేలా సర్వే ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచించారు. భూముల వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేయడం, భూముల హద్దులను గుర్తించడం, భూ రికార్డులను మరింత పారదర్శకంగా నిర్వహించడం వంటి అంశాల్లో డిజిటల్ సర్వే కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కావుడే తులసీరామ్, వార్డు సభ్యుడు అనుముల శంకర్, సర్వేయర్ రమేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

# పోలీస్, రెవెన్యూ, విద్యాశాఖల్లో పెండింగ్ ఆర్టీఐ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ హరిత**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** సమాచార హక్కు చట్టం (ఆర్ టీ ఐ-2005) క్రింద వచ్చిన దరఖాస్తులకు నిర్ణీత గడువులోగా పూర్తి సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రజా సమాచార అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమాచార అధికారులు దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా పోలీస్, రెవెన్యూ, విద్యా శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై తక్షణమే స్పందించి దరఖాస్తుదారులకు అవసరమైన సమాచారాన్ని అందించాలని స్పష్టం చేశారు.

**ఈ నెల 28న ఆర్టీఐ కమిషన్ రాక**

ఈ నెల 28వ తేదీన సమాచార హక్కు చట్టం కమిషన్ సభ్యులు జిల్లా పర్యటనకు రానున్నారని కలెక్టర్ తెలిపారు. కమిషన్‌కు అప్పీలుకు వెళ్లిన దరఖాస్తులకు సంబంధించి ఇప్పటికే అవసరమైన సమాచారాన్ని దరఖాస్తుదారులకు చేరవేసి, దానికి సంబంధించిన నివేదికలను ఈ సోమవారంలోగా కలెక్టరేట్‌లో సమర్పించాలని ప్రజా సమాచార అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, అదనపు ఎస్.పి. (అడ్మిన్) చిత్తరంజన్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో పాటు పలు శాఖల జిల్లా అధికారులు, ప్రజా సమాచార అధికారులు పాల్గొన్నారు.

# ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని పట్టుదలతో సాధించి, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో ఐ ఐ టి కాన్పూర్ లో విద్య అభ్యసిస్తున్న పెరుగు సాయిరాం కు ల్యాప్ టాప్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కౌటాల మండలం బోధన్ పల్లి గ్రామానికి చెందిన పెరుగు దేవాజీ-కవిత దంపతుల కుమారుడైన సాయిరాం ప్రతిష్టాత్మక ఐఐటి కాన్పూర్ లో విద్య అభ్యసించడం అభినందనీయమని తెలిపారు. ఉన్నత విద్యలో ప్రతిభ కనబరుస్తూ లక్ష సాధన దిశగా ముందుకు సాగాలని, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఉన్నత విద్యకు ప్రోత్సాహకంగా సాయిరాం కు ల్యాప్ టాప్ అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పంటను నేరుగా మార్కెట్కు తీసుకురావాలి

- **మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణలోని ఇతర ప్రధాన మార్కెట్లతో పోలిస్తే ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తికి అధిక ధర లభిస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా, నాణ్యమైన పత్తిని నేరుగా మార్కెట్కు తీసుకువచ్చి మెరుగైన ధర పొందాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్ల రెండో రోజు కూడా ప్రైవేట్ వ్యాపారులు క్వింటాలుకు రూ.9,260 ధర చెల్లించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కార్యాలయంలోని నోటీసు బోర్డుపై రాష్ట్రంలోని ప్రధాన మార్కెట్లలో నమోదైన పత్తి ధరల వివరాలను అధికారికంగా ప్రదర్శించారు. రైతులకు మెరుగైన ధరలు అందించడమే లక్ష్యంగా కొనుగోళ్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇతర ప్రధాన మార్కెట్లలో నమోదైన ధరల వివరాలను పరిశీలిస్తే.. వరంగల్లో క్వింటాలుకు రూ.9,010, జమ్మికుంటలో రూ.9,170, ఖమ్మంలో రూ.9,100 ధర పలికినట్లు తెలిపారు. ఆదిలాబాద్ మార్కెట్లో భారత పత్తి సంస్థ (సీసీఐ) ద్వారా క్వింటాలుకు రూ.8,667 మద్దతు ధర లభిస్తుండగా, ప్రైవేట్ కొనుగోళ్లలో రూ.9,260 ధర నమోదైందని వివరించారు. రైతులు తమ పత్తిని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా తీసుకువచ్చి మార్కెట్లో విక్రయించాలని, అందుబాటులో ఉన్న ధరలను పరిశీలించి ప్రయోజనం పొందాలని సూచించారు. మార్కెట్లో కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ విఠల్, మార్కెట్ సూపర్వైజర్ స్వామి, వివిధ శాఖల అధికారులు, కమీషన్ ఏజెంట్లు,రైతులు పాల్గొన్నారు.

# జ్ఞానేష్ కుమార్ను పదవి నుంచి తొలగించాలి

- **సత్తుపల్లిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన**




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, కేంద్ర ప్రభుత్వం ఆయనతో రాజీనామా చేయించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహింరు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా నాయకుడు మోరంపూడి పాండురంగారావు, రైతు సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి రావుల రాజబాబు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కొలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) కారణంగా అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా ఎన్నికల కమిషన్ పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా ఎన్నికల కమిషన్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల హక్కుల పరిరక్షణకు సంబంధించి ఈ అంశంపై రాష్ట్రపతి జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్కే వలి, భాస్కర్, మీసాల వెంకట్రావు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, దాట్ల రాంబాబు, మహిళా సంఘం నాయకురాలు పాకలపాటి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ను రద్దు చేయాలి

**కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ధర్నా**




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వానికి దాసోహమైన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన జేబు సంస్థగా మార్చుకుందని విమర్శించారు. దేశంలో ఎస్ఐఆర్ పేరుతో కుట్రపూరితంగా సుమారు 13కోట్ల ఓట్లను తొలగించడం రాజ్యాంగ హక్కులను హరించడమేనని మండిపడ్డారు. తక్షణమే తొలగించిన ఓట్లన్నింటినీ పునరుద్ధరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో దేశ వ్యాప్తంగా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ పోరాటంలో ప్రజాస్వామికవాదులు, మేధావులు, ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు సాయన్న, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మంజుల, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కార్యదర్శి ఆరిఫా, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు గోవింద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆశన్న, ప్రజాసంఘాల ప్రతినిధులు అగ్గిమల్ల స్వామి, సురేందర్, పొచ్చన్న, దశాంత్, జ్యోతి, శత్రుఘ్న, దత్తు తదితరులు పాల్గొన్నారు.



# నమన్ ధీర్.. టీమ్ఇండియాకు కొత్త ఆశాకిరణం!

న్యూజిలాండ్ బలమైన పేస్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొని భారీ లక్ష్యాన్ని ఛేదించిన టీమ్ఇండియా ఐదు టీ20ల సిరీస్‌ను అద్భుత విజయంతో ప్రారంభించింది. ఈ గెలుపులో ఓపెనర్ సంజు శాంసన్ (67) కీలక ఇన్నింగ్స్ ఆడగా.. చివర్లో క్రీజులోకి వచ్చిన నమన్ ధీర్ (42 నాటౌట్; 15 బంతుల్లో) మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగి జట్టును విజయతీరాలకు చేర్చాడు. అంతర్జాతీయంగా పరిమిత మ్యాచ్‌లు మాత్రమే ఆడినప్పటికీ ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా అతడు ఆడిన తీరు క్రికెట్ వర్గాల నుంచి సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. న్యూజిలాండ్‌పై తొలి టీ20లో భారత్ విజయం సాధించడంలో నమన్ ధీర్ పాత్ర అత్యంత కీలకమని సంజు శాంసన్ కొనియాడాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తక్కువ అనుభవం ఉన్నప్పటికీ కీలక సమయంలో ప్రత్యర్థి బౌలింగ్‌ను ధీటుగా ఎదుర్కొంటూ అద్భుత విజయాన్ని అందించాడని ప్రశంసించాడు. అతడి ప్రదర్శన చూస్తుంటే భవిష్యత్తులో భారత జట్టుకు నమ్మదగిన కీలక ఆటగాడిగా ఎదిగే అన్ని అర్హతలు ఉన్నాయని అభిప్రాయపడ్డాడు. మరోవైపు నమన్ ధీర్ రాణించడం వల్ల జట్టు ఎంపికలో మేనేజ్‌మెంట్‌కు మరిన్ని ప్రత్యామ్నాయ అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తెలిపారు. కేవలం బ్యాటింగ్ మాత్రమే కాకుండా బౌలింగ్ కూడా చేయగలగడం అతడికి పెద్ద అదనపు బలమని పేర్కొన్నాడు. జట్టు సంక్షోభంలో ఉన్నప్పుడు ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉంటూ తన సహజమైన ఆటతీరుతో ఆకట్టుకున్నాడని ప్రశంసించాడు. ఈ మ్యాచ్‌లో నమన్ కేవలం 15 బంతుల్లోనే 4 ఫోర్లు, 2 సిక్సర్ల సహాయంతో 42 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్‌తో టీ20ల్లో భారత్ తరఫున 7వ స్థానంలో లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్‌కు వచ్చి అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. గతంలో 2009లో శ్రీలంకపై ఇర్ఫాన్ పఠాన్ 33 పరుగులతో అజేయంగా నిలిచిన రికార్డును నమన్ అధిగమించడంతో అతడి ప్రదర్శనకు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.



# రెండో టీ20కి ఇషాన్ దూరం.. వైభవ్‌కు ఛాన్స్!

**గజ్జల్లో నొప్పితో ఇషాన్ కిషన్ ఇబ్బందులు**

**అతడి స్థానంలో వైభవ్ సూర్యవంశీకి అవకాశం**

**బ్యాటింగ్ ఆర్డర్‌పై టీమ్ మేనేజ్‌మెంట్ కసరత్తు**

**సంజు శాంసన్‌కు మరో స్థానం దక్కేనా?**

న్యూజిలాండ్ పర్యటనను విజయంతో ప్రారంభించిన భారత జట్టుకు రెండో టీ20కి ముందు ఎదురుదెబ్బ తగిలింది. గాయం కారణంగా వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ తదుపరి మ్యాచ్‌కు దూరం కానున్నాడు. అతడి స్థానంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో అవకాశం దక్కవచ్చని భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ వెల్లడించారు. దీంతో రెండో టీ20లో భారత జట్టు కూర్పుపై ఆసక్తి నెలకొంది. ఇషాన్ కిషన్ గజ్జల్లో నొప్పితో బాధపడుతున్నాడని సితాన్షు కోటక్ తెలిపారు. తొలి టీ20లోనూ ఈ సమస్య కారణంగా బ్యాటింగ్ క్రమంలో మార్పులు చేసినట్లు చెప్పారు. తిలక్ వర్మను ముందుగా పంపించిన తర్వాత ఇషాన్ బ్యాటింగ్‌కు వచ్చాడని వివరించారు. అయితే రెండో మ్యాచ్‌లో మాత్రం అతడు ఆడడని స్పష్టం చేశారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి వైద్య బృందం ఇషాన్ గాయం పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందన్నారు. మరోవైపు వైభవ్ సూర్యవంశీ తుది జట్టులో స్థానం కోసం పోటీలో ఉన్నాడని పేర్కొన్నారు. వైభవ్ సూర్యవంశీ జట్టులోకి వస్తే భారత బ్యాటింగ్ క్రమంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. సంజు శాంసన్, అభిషేక్ శర్మ సాధారణంగా ఓపెనర్లుగా బరిలోకి దిగుతుండగా.. వైభవ్ కూడా ఇన్నింగ్స్‌ను ఆరంభించగలడు. ఇషాన్ అందుబాటులో లేకపోవడంతో మూడో స్థానంలో ఎవరిని ఆడిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. గతంలో వన్‌డౌన్‌లో బ్యాటింగ్ చేసిన అనుభవం సంజు శాంసన్‌కు ఉంది. దీంతో జట్టు యాజమాన్యం ఎలాంటి కూర్పును ఎంచుకుంటుందో చూడాలి. రెండో టీ20లోనూ విజయం సాధించి ఆధిక్యాన్ని పెంచుకోవాలని భారత్ భావిస్తోంది.

# అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన శ్రీలంక

- 400 పరుగుల లక్ష్య ఛేదన అసాధ్యమనుకున్నా
- అద్భుతంగా పోరాడి గెలిచిన లంక జట్టుకు అజహర్ ప్రశంసలు
- హ్యారీ బ్రూక్ ద్విశతకంపైనా మాజీ కెప్టెన్ అభినందనలు
- టెస్టు క్రికెట్టే అత్యుత్తమ ఫార్మాట్ అని వ్యాఖ్య
- న్యూజిలాండ్‌పై భారత్ విజయం పట్ల హర్షం



**స్పోర్ట్స్ డెస్క్, అక్టోబర్ 23:** వన్డే క్రికెట్‌లో 400కు పైగా పరుగుల లక్ష్యాన్ని ఛేదించడం అరుదైన ఘనత. అలాంటి అసాధ్యమనుకున్న లక్ష్యాన్ని ఛేదించి ఇంగ్లాండ్‌పై విజయం సాధించిన శ్రీలంక జట్టుపై టీమిండియా మాజీ కెప్టెన్, తెలంగాణ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ ప్రశంసలు కురిపించారు. భారీ లక్ష్యాన్ని ఛేదించగలమనే నమ్మకంతో చివరి వరకు పోరాడిన లంక ఆటగాళ్లు అద్భుతంగా ఆడారని కొనియాడారు. ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ ద్విశతకంపైనా అభినందనలు తెలిపారు.

**లంక పోరాటం అద్భుతం**

400కు పైగా పరుగుల లక్ష్య ఛేదన తనకు అసాధ్యమనిపించేదని అజహరుద్దీన్ పేర్కొన్నారు. అయితే ప్రస్తుత క్రికెట్‌లో భారీ లక్ష్యాలను ఛేదించడం సాధారణంగా మారుతోందన్నారు. గెలవలేమని ముందే భావిస్తే లక్ష్యాన్ని చేరుకోవడం మరింత కష్టమవుతుందని అభిప్రాయపడ్డారు. శ్రీలంక ఆటగాళ్లు చివరి వరకు ఆత్మవిశ్వాసంతో ఆడి



గొప్ప విజయాన్ని అందుకున్నారని ప్రశంసించారు. ఇలాంటి ఉత్కంఠభరిత మ్యాచ్‌లు అభిమానులను ఆకట్టుకోవడంతోపాటు వన్డే క్రికెట్‌పై ఆసక్తిని పెంచుతాయని పేర్కొన్నారు.

**టెస్టులే అత్యుత్తమం**

క్రికెట్‌లో టెస్టు ఫార్మాట్‌కు ప్రత్యేక స్థానం ఉందని అజహరుద్దీన్ స్పష్టం చేశారు. సుదీర్ఘ ఫార్మాట్‌లోనే ఆటగాళ్ల నైపుణ్యానికి అసలైన పరీక్ష ఎదురవుతుందని పేర్కొన్నారు. టెస్టు క్రికెట్‌ను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు న్యూజిలాండ్‌పై తొలి టీ20లో విజయం సాధించిన భారత జట్టును అభినందించారు. విదేశీ పర్యటనల్లో స్థానిక పరిస్థితులకు త్వరగా అలవాటు పడటం విజయాలకు కీలకమని పేర్కొన్నారు. భారత యువ ఆటగాళ్లు సమర్థంగా ఆడారని, ఈ ప్రదర్శనతో సిరీస్‌ను కూడా కైవసం చేసుకుంటారనే నమ్మకం ఉందని అజహరుద్దీన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# పారా ఆసియాలో భారత్ పతాకం

- 114 పతకాలతో రికార్డు
- 30 స్వర్ణాలు.. 35 రజతాలు.. 49 కాంస్యాలు
- పతకాల పట్టికలో నాలుగో స్థానంతో సరికొత్త చరిత్ర
- మోనా అగర్వాల్‌కు రెండో స్వర్ణం
- పరుగులో సందీప్ ప్రపంచ రికార్డు
- జావెలిన్ త్రోలో హనీ అసాధారణ ప్రదర్శన




**నగోయా (జపాన్), అక్టోబర్ 23 :** పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు సరికొత్త చరిత్ర సృష్టించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 114 పతకాలు సాధించి సత్తా చాటారు. 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్యాలతో పతకాల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచారు. 2022లో జరిగిన క్రీడల్లో సాధించిన పతకాల కంటే ఈసారి ఆరు ఎక్కువగా గెలుచుకోవడం విశేషం. పారా ఆసియా క్రీడల చరిత్రలో భారత్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. చైనా 427 పతకాలతో అగ్రస్థానంలో నిలవగా.. జపాన్ 185, ఉజ్బెకిస్థాన్ 145 పతకాలతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. దక్షిణ కొరియా 97 పతకాలతో ఐదో స్థానంలో కొనసాగుతోంది. చివరి రోజు భారత పారా షూటర్ మోనా అగర్వాల్ 50 మీటర్ల రైఫిల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. చైనాకు చెందిన క్యూపింగ్ జాంగ్‌పై 3.8 పాయింట్ల ఆధిక్యంతో విజయం సాధించి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఈ క్రీడల్లో మోనాకు ఇది రెండో స్వర్ణం కావడం విశేషం. టీ64 పురుషుల 400 మీటర్ల పరుగులో సందీప్ 52.28 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని స్వర్ణం గెలవడంతోపాటు ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఇదే విభాగంలో కాంస్యం సాధించిన మరో భారత అథ్లెట్ అజయ్ కుమార్ 53.61 సెకన్లతో రికార్డు ప్రదర్శన నమోదు చేశాడు. జావెలిన్ త్రోలో భారత అథ్లెట్ హనీ అసాధారణ ప్రదర్శనతో ప్రపంచ రికార్డును రెండుసార్లు బద్దలు కొట్టాడు. ఎఫ్37 విభాగంలో ఐదో ప్రయత్నంలో 59.72 మీటర్లు విసిరి కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. అనంతరం చివరి ప్రయత్నంలో 60.49 మీటర్ల దూరం విసిరి తన రికార్డును తానే అధిగమించాడు. భారత అథ్లెట్ల ఈ అద్భుత ప్రదర్శన దేశ క్రీడా రంగానికి గర్వకారణంగా నిలిచింది. మొత్తంగా 114 పతకాలతో భారత్ తన పారా ఆసియా క్రీడల ప్రస్థానంలోనే అత్యుత్తమ అధ్యాయాన్ని లిఖించింది.

# కోహ్లీ, కుంబ్లే మాట నిలబెట్టుకోలేదు!

- గాయం నుంచి కోలుకున్నా జట్టులో దక్కని చోటు
- అంతర్జాతీయ కెరీర్‌పై అమిత్ మిశ్రా ఆవేదన
- ఫోన్‌లు, సందేశాలకు స్పందన రాలేదని వెల్లడి
- ఆకాశ్ చోప్రా ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు

గాయం కారణంగా అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైన తర్వాత తిరిగి ఫిట్‌నెస్ సాధించినా టీమ్ఇండియాలో అవకాశం దక్కలేదని మాజీ స్పిన్నర్ అమిత్ మిశ్రా ఆవేదన వ్యక్తం చేశాడు. అప్పటి కోచ్ అనిల్ కుంబ్లే, కెప్టెన్ విరాట్ కోహ్లీ తనకు హామీ ఇచ్చినా ఆ మాట నిలబెట్టుకోలేదని ఆరోపించాడు. గాయం నుంచి కోలుకున్న తర్వాత జట్టులోకి తిరిగి రావడానికి ప్రయత్నించినా తనకు సరైన సమాధానం లభించలేదని తెలిపాడు. తాజాగా ఆకాశ్ చోప్రాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్‌కు సంబంధించిన అనుభవాలను పంచుకున్నాడు.

**హామీ ఇచ్చినా అవకాశం రాలేదు**

బెంగళూరులో ఉన్న సమయంలో కాలికి గాయమైందని అమిత్ మిశ్రా తెలిపాడు. అప్పట్లో కోచ్‌గా ఉన్న అనిల్ కుంబ్లేను సంప్రదించగా.. ఫిట్‌నెస్ సాధించిన వెంటనే జట్టులోకి తిరిగి రావచ్చని భరోసా ఇచ్చినట్లు వెల్లడించాడు. అదే సమయంలో కెప్టెన్‌గా ఉన్న విరాట్ కోహ్లీని కూడా సంప్రదించానని, అతడి నుంచి కూడా ఇలాంటి సమాధానమే వచ్చిందని చెప్పాడు. గాయం నుంచి కోలుకున్న తర్వాత జాతీయ జట్టులో పునరాగమనంపై కోహ్లీకి సందేశం పంపినా స్పందన రాలేదని తెలిపాడు. నేరుగా అడిగినప్పుడు వారం, పది రోజుల్లో చెబుతానని అన్నాడని.. ఆ తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా, సందేశాలు పంపినా సమాధానం ఇవ్వలేదని మిశ్రా పేర్కొన్నాడు.



**నా విషయంలోనే ఎందుకిలా?**

పదేపదే ఫోన్లు చేయడం, సందేశాలు పంపడం వల్ల విసిగిపోయి చివరకు ప్రయత్నాలు విరమించుకున్నానని అమిత్ మిశ్రా తెలిపాడు. జట్టుకు తన అవసరం లేదని భావించినప్పుడు తాను మాత్రం ఏం చేయగలనని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకంటే తీవ్రంగా గాయపడిన పలువురు క్రికెటర్లు కోలుకున్న వెంటనే జట్టులోకి తిరిగి వచ్చారని.. తన విషయంలో మాత్రం అలా జరగలేదని పేర్కొన్నాడు. అందుకు కారణం ఏమిటో ఇప్పటికీ తనకు తెలియదన్నాడు. ఇటీవలే ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు స్పిన్ బౌలింగ్ కోచ్‌గా నియమితుడైన మిశ్రా.. తన అంతర్జాతీయ కెరీర్ ముగింపు గురించి చేసిన ఈ వ్యాఖ్యలు క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

# బటర్‌ఫ్లై గ్లామ్‌తో రిద్ధి కుమార్ లుక్



నటి రిద్ధి కుమార్ లండన్ పర్యటనలో సందడి చేస్తోంది. అక్కడి అందమైన ప్రదేశాలను ఆస్వాదిస్తూ, తన ట్రిప్‌కు సంబంధించిన విశేషాలను సోషల్ మీడియాలో పంచుకుంటోంది. భారతీయ, థాయ్, ఫ్రెంచ్ వంటకాలను రుచి చూసిన ఆమెకు ఫ్రెంచ్ డెజర్ట్ టార్ట్ టాటిన్ కొత్త ఫేవరెట్‌గా మారిందట. రోజును పౌర్ణమి వేళ సంకల్పాలు చేసుకోవడం, ఆరా శుద్ధి చేసుకునే ఆచారంతో ముగించినట్లు వెల్లడించింది. ఈ పర్యటనలో రిద్ధి ధరించిన ప్రత్యేకమైన దుస్తులు ఆకర్షణగా నిలిచాయి. బ్రౌన్ కలర్ హాల్టర్ క్రాప్ టాప్‌కు డీప్ వీ-నెక్ డిజైన్ జోడించగా, పింక్ ఫ్లోరల్ ప్రింట్‌తో కూడిన లో-రైజ్ రఫుల్ స్కర్ట్ ఆమె లుక్‌కు ప్రత్యేకతను తెచ్చింది. ముందువైపు, వెనుకవైపు వేర్వేరు పొడవులతో ఉన్న స్కర్ట్‌కు స్టడ్స్‌తో కూడిన బ్రౌన్ బెల్ట్‌ను జత చేసింది. బటర్‌ఫ్లై హెయిర్ క్లిప్స్, పింక్ స్టోన్ నెక్లెస్, వదులుగా వదిలిన జుట్టుతో తన గ్లామరస్ స్టైలింగ్‌ను పూర్తి చేసింది. సినిమాల విషయానికొస్తే.. ఈ ఏడాది ప్రభాస్ సరసన 'ది రాజా సాబ్' చిత్రంలో రిద్ధి కుమార్ నటించింది. అయితే ఈ హారర్ కామెడీ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అంతకుముందు మరాఠీ చిత్రం 'కడిపట్టా', 'సూపర్‌బాయ్స్ ఆఫ్ మాలేగావ్'లోనూ ఆమె కనిపించింది.





# రెడ్ లేస్‌అప్ డ్రెస్‌లో శ్రద్ధా దాస్ గ్లామర్

నటి శ్రద్ధా దాస్ తన స్టైలిష్ లుక్‌తో మరోసారి ఆకట్టుకుంది. నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'ఖాకీ: ది బెంగాల్ చాప్టర్' ప్రమోషన్లలో భాగంగా ఆమె చేసిన ఫొటోషూట్ ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ సందర్భంగా శ్రద్ధా ఎరుపు రంగు కార్సెట్ తరహా డ్రెస్‌లో మెరిసింది. హార్ట్‌షేప్ నెక్‌లైన్, స్ట్రాప్‌లపై లేస్ డిజైన్, వెనుకవైపు లేస్‌అప్ స్టైలింగ్ ఈ దుస్తులకు ప్రత్యేకతను తీసుకొచ్చాయి. శరీరాకృతికి అనుగుణంగా ఉన్న ఫిటెడ్ స్కర్ట్ ఆమె లుక్‌ను మరింత అందంగా తీర్చిదిద్దింది. బంగారు రంగు హూప్ చెవిపోగులు, పింక్ నెయిల్స్, అలల జుట్టు, సహజమైన మెరుపుతో కూడిన మేకప్‌తో తన స్టైలింగ్‌ను పూర్తి చేసింది. నీలిరంగు నేపథ్యంపై ఎరుపు డ్రెస్ ప్రత్యేకంగా కనిపించింది. ఇక సినిమాల విషయానికొస్తే.. శ్రద్ధా దాస్ చివరిగా 'లేచింది మహిళా లోకం' చిత్రంలో కనిపించింది. అయితే ఈ సినిమా ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. ప్రస్తుతం ఆమె తాజా లుక్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది.



# గోల్డ్ సీక్విన్ డ్రెస్‌లో శోభితా రానా మెరుపులు

నటి శోభితా రానా గోల్డ్ సీక్విన్ దుస్తుల్లో మెరిసిపోతోంది. మెటాలిక్ గోల్డ్ స్లీవ్‌లెస్ టాప్, పింక్-గోల్డ్ చోకర్ నెక్లెస్, చేతికి వాచ్, బ్యాంగిల్స్‌తో స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకుంది. అద్దం ముందు సెల్ఫీ తీసుకుంటూ ఇచ్చిన పోజులు ఆమె గ్లామర్‌ను మరింతగా చాటిచెప్పాయి. మోడలింగ్‌తో కెరీర్ ప్రారంభించిన శోభితా, 2014లో 'ఇష్క్ బ్రాండీ'తో నటిగా అరంగేట్రం చేసింది. హిందీలో 'గోలు అండ్ పప్పు'లో నటించగా, తెలుగులో 'రాజా మీరు కేక', 'రంగ రంగ వైభవంగా' చిత్రాలతో గుర్తింపు పొందింది. కన్నడ థ్రిల్లర్ 'షాడో'లోనూ కనిపించింది.

# ప్రభాస్ బర్త్ డే.. వంగా మార్క్ సెలబ్రేషన్

ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతుండగా.. సందీప్ రెడ్డి వంగా మాత్రం ప్రత్యేకంగా వేడుక చేసుకున్నారు. చేతిలో డ్రింక్ బాటిల్‌తో సందీప్ కనిపించగా.. పక్కనే ఉన్న ప్రభాస్ నవ్వుతూ సందడి చేశారు. ఈ ఫొటోను 'స్పిరిట్స్ ఆర్ హై' అనే వ్యాఖ్యతో పంచుకోవడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. సినిమా పేరుకు తగ్గట్టుగా ఇద్దరూ కలిసి సందడి చేస్తున్నారంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో సంచలనం సృష్టించిన సందీప్.. ప్రభాస్‌ను ఏ తరహా పాత్రలో చూపించబోతున్నారన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. మరోవైపు ఈ సినిమా విడుదల తేదీపై చిత్ర బృందం కీలక ప్రకటన చేసింది. తొలుత 2027 మార్చి 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించినప్పటికీ.. తాజాగా విడుదల తేదీని మార్చింది. 2027 అక్టోబర్ 29న దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా సినిమాను థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ప్రభాస్ ఇమేజ్‌కు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వ శైలి తోడవడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీ కూడా ఖరారు కావడంతో అభిమానులు ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN**, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# ఎయిర్పోర్ట్ భూసేకరణ వేగవంతం చేయాలి

- నిర్వాసితులకు సత్వరమే పరిహారం
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో ప్రతిపాదిత విమానాశ్రయ విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను ఎలాంటి జాప్యానికి తావులేకుండా పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించి, క్షేత్రస్థాయిలో పనులు నిర్దేశిత ప్రణాళిక ప్రకారం ముందుకు సాగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇండియన్ ఎయిర్ఫోర్స్ (ఐఎఎఫ్) పర్యవేక్షక బృందంతో కలిసి ఎయిర్పోర్ట్ భూసేకరణ పనుల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. విమానాశ్రయ విస్తరణకు అవసరమైన భూమి వివరాలు, ఇప్పటివరకు చేపట్టిన సర్వే, భూసేకరణ పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విమానాశ్రయ అభివృద్ధిలో భూసేకరణ ప్రక్రియ అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ భూసేకరణకు సంబంధించిన అన్ని అంశాలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న భూ సర్వే పనులను పకడ్బందీగా చేపట్టాలని, సర్వే సమయంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన వివరాలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సేకరించి, ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విమానాశ్రయ విస్తరణ కోసం భూములు కోల్పోతున్న నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతి భూ నిర్వాసితుడికి అందాల్సిన పరిహారం, పునరావాస ప్రయోజనాలు సత్వరమే అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, భూములకు సంబంధించిన రికార్డులు, హక్కులు, ఇతర వివరాలను నిశితంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. భూసేకరణకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన సర్వే, భూముల వివరాల సేకరణ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులు, పరిష్కరించాల్సిన అంశాలపై జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది కలెక్టర్కు వివరించారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చేపడుతున్న చర్యలను తెలియజేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఎయిర్ఫోర్స్ పర్యవేక్షక బృందం సభ్యులు కెప్టెన్ రాకేష్, ఎస్.ఆర్. సింగ్, ఆర్డీవో జగదీశ్వర్రావు, ల్యాండ్ సర్వే ఆర్ఎడీ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు విధులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన




**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గంభీరావుపేట పోలీస్స్టేషన్లో శుక్రవారం విద్యార్థుల కోసం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్ పోలీసుల విధులు, బాధ్యతలు, చట్టాలు, నేరాల నియంత్రణ, దర్యాప్తు విధానాలపై విద్యార్థులకు వివరించారు. పోలీస్ స్టేషన్లో రోజువారీగా నిర్వహించే కార్యకలాపాలను పరిచయం చేస్తూ, నేరాల దర్యాప్తులో ఫింగర్ప్రింట్ పరికరాలు, సీసీ కెమెరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం గురించి తెలియజేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండటం, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించడం వంటి అంశాలపై సూచనలు చేశారు. అపరిచితుల నుంచి వచ్చే అనుమానాస్పద ఫోన్కాల్స్, సందేశాలు, లింక్ లను తెరవవద్దని సూచించారు. చిన్న వయస్సు నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ తెలిపారు.

# వైద్య కళాశాలలో పారదర్శకంగా నియామక ప్రక్రియ

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్






**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ, అభ్యర్థుల ప్రతిభ, మెరిట్, అర్హతల ఆధారంగా ఎంపిక చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలంలో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో దంత వైద్య విభాగంలో అధ్యాపకుల కోసం నిర్వహించిన నియామక ప్రక్రియకు కళాశాల ప్రిన్సిపల్ దేవాజి, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు అశోక్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియామక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా చేపట్టడం జరిగిందని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక కోసం రాత పరీక్ష, పీజీ మార్కులు, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకొని, అభ్యర్థుల విద్యార్హతలు, ప్రతిభ, అనుభవం తదితర అంశాలను పరిశీలించి మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇంటర్వ్యూలో అభ్యర్థులు సాధించిన మార్కులతో పాటు, పీజీ మార్కులకు నిర్దేశించిన వెయిటేజీని పరిగణనలోకి తీసుకొని తుది మెరిట్ను నిర్ణయించడం జరిగిందని, ఈ ప్రక్రియలో అభిషేక్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చగా, ఎంపిక చేసేందుకు కమిటీ నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థి త్వరలో విధుల్లో చేరేలా నియామక ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కళాశాల మైదానం అభివృద్ధి, క్రీడా వసతుల కల్పన, తాగునీటి సదుపాయం, ఇంటర్నెట్ సౌకర్యాల మెరుగుదలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జంగా శ్రీనివాసరెడ్డి మాతృమూర్తి మృతి

## నివాళులు అర్పించిన మట్టా దయానంద్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జంగా శ్రీనివాసరెడ్డి మాతృమూర్తి మృతిచెందడంతో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ గురువారం రాత్రి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాతృమూర్తి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి, వేంసూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహిస్తూ, తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు సాధించే పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖతో కలిసి మండల వ్యవసాయ అధికారులతో వ్యవసాయ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల సాగు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం ద్వారా ఆరుతడి పంటల సాగుపై రైతులకు వివరించాలన్నారు. నవంబర్ 30వ తేదీ వరకు జిల్లాలోని రైతు వేదికలలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. మండలాల వారీగా పంటల వైవిధ్యీకరణ ప్రణాళికలను రూపొందించి, గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహిస్తూ, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడటంతో పాటు విత్తనాల విక్రయాలపై పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. మొక్కజొన్న పంటకు కనీస మద్దతు ధర, వరి సన్న ధాన్యం కొనుగోళ్లు, పత్తి పంట కోతలు, కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడంతో పాటు కూరగాయల విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. కడెం ప్రాజెక్టు నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లాలని, యాసంగిలో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా పంటలు దెబ్బతినే అవకాశం ఉన్నందున, ఆరుతడి పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నీటి పొదుపు సాగు విధానాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల వారీగా తక్కువ నీటితో విజయవంతంగా పంటలు సాగు చేస్తున్న రైతులను గుర్తించి, వారు అనుసరిస్తున్న పద్ధతులను ఇతర రైతులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. విజయవంతమైన సాగు విధానాలను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా జిల్లాలో నీటి పొదుపు వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## రీ సర్వేను తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. భూముల రీ సర్వే, భూభారతి దరఖాస్తులపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్తో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రీ సర్వేలో భాగంగా మండలాల వారీగా సర్వే చేసిన గ్రామాల వివరాలు, ప్రక్రియ పురోగతిపై ఆరా తీశారు. రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో సర్వేను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో సర్వే చేపట్టే విషయాన్ని పట్టాదారులకు ముందుగా తెలియజేసి, వారి సమక్షంలోనే భూముల సర్వే చేయాలని స్పష్టం చేశారు. డిప్యూటీ తహశీల్దార్, సర్వేయర్, జీపీఓలతో బృందాలు ఏర్పాటు చేసి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో ప్రక్రియను తప్పనిసరిగా పర్యవేక్షించాలని, లైసెన్స్డ్ సర్వేయర్లతో సమన్వయం చేసుకుంటూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు శ్రీధర్బాబు, కేవిస్బి కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, తహశీల్దార్లు, లైసెన్స్డ్ సర్వేయర్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

# ఘనంగా రెబల్ స్టార్ ప్రభాస్ జన్మదిన వేడుకలు

**కరీంనగర్, అక్టోబర్ 23:**

సినీ హీరో రెబల్ స్టార్ ప్రభాస్ జన్మదిన వేడుకలను కరీంనగర్ జిల్లాలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు కరీంనగర్ లోని ప్రధాన కూరగాయల మార్కెట్ వద్ద గల వెంకటేశ్వర ఆలయం సమీపంలో అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు కాశపాక శ్యామ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా, వివిధ ప్రాంతాల నుంచి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫ్యాన్స్ గౌరవాధ్యక్షుడు ఎర్రంరాజు లక్ష్మణ్ రాజు హాజరై ప్రభాస్ బర్త్ డే కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ రాజు మాట్లాడారు. హీరో ప్రభాస్ అనతి కాలంలోనే దేశంలోని బిగ్గెస్ట్ స్టార్ హీరోగా ఎదిగాడని కొనియాడారు. తెలుగు సినిమా మార్కెట్ ని తన సినిమాలతో అంతర్జాతీయ స్థాయికి విస్తరించాడని ప్రశంసించారు. ప్రభాస్ రాబోయే చిత్రాలు కూడా భారీ బడ్జెట్ తో రూపొందుతున్నాయని అవి కూడా అంతర్జాతీయ స్థాయిలో విడుదల కాబోతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని గొప్ప చిత్రాలు నటించి తెలుగు మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు కాశపాక శ్యామ్, ప్యాన్స్ గౌరవ సలహాదారుడు కొండన్న, నగర అధ్యక్షుడు గాలి అజయ్, జిల్లా ఉపాధ్యక్షులు తాజ్ బాబా, పొన్నాల రాజేష్, ఎండీ రియాజ్, జంగం నాగేందర్, అంజి, విజయ్, వివిధ ప్రాంతాల అభిమాన సంఘం బాధ్యులు పాల్గొన్నారు.



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శనివారం 24 అక్టోబర్ 2026

# బియ్యం దుకాణాల్లో పౌరసరఫరాల శాఖ అధికారుల తనిఖీలు



**ఉద్యమ కెరటం, ఖమ్మం:** ఖమ్మం నగరంలోని ప్రకాష్ నగర్, చర్చి కాంపౌండ్, శ్రీనివాస్ నగర్ ప్రాంతాల్లో గల బియ్యం వ్యాపారుల దుకాణాల్లో జిల్లా ఆదేశాల మేరకు శుక్రవారం పౌరసరఫరాల శాఖ అధికారులు డిప్యూటీ తహశీల్దార్లతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్ సూర్యాపేట, కరీంనగర్ జిల్లాల నుంచి కొనుగోలు చేసిన బియ్యానికి సంబంధించిన బిల్లులు, వే బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించారు. వినియోగదారుల సౌకర్యార్థం ప్రతి దుకాణం ప్రధాన ద్వారం వద్ద అందుబాటులో ఉన్న బియ్యం నిల్వల పరిమాణం, వాటి ధరల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని వ్యాపారులను ఆదేశించారు. బియ్యాన్ని అధిక ధరలకు విక్రయించడం, మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించడం గానీ చేయరాదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించే వ్యాపారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వ్యవసాయ బోర్లకు ముందస్తు అనుమతి తప్పనిసరి

**ఉద్యమ కెరటం, జైనథ్:** వ్యవసాయ భూముల్లో బోర్లు వేయాలనుకునే రైతులు ముందస్తు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ నారాయణ ఒక ప్రకటన తెలిపారు. దరఖాస్తుతో పాటు Dy. Director of Ground Water, Adilabad పేరున రూ.వెయ్యి డీడీ, జైనథ్ తహశీల్దార్ పేరిట రూ.100 డీడీ సమర్పించాలని పేర్కొన్నారు. ఫారం-2 దరఖాస్తు, ఆధార్ కార్డు నకలు, పట్టా పాసుబుక్ నకలును జతచేసి జైనథ్ తహశీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. రైతులు నిబంధనల ప్రకారం అనుమతులు పొందాలని కోరారు.

# అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని భీమారం మండలంలోని భీమారం, భూరుగుపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, విద్యా కార్యక్రమాలు, పారిశుధ్య నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ పనులు, పలు ప్రభుత్వ పాఠశాలలు, భవిత కేంద్రం, పంట కుంటలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణ పనులు, గ్రామ పంచాయతీ రికార్డులు, ఇంకుడు గుంతలు, సమీకృత ఎస్సీ, బీసీ వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, అభ్యాసనంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. భవిత కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న సేవలు, సదుపాయాలను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు వారి సామర్థ్యాలకు అనుగుణంగా బోధన, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. భీమారం గ్రామంలో చేపట్టిన పంట కుంట పనులను పరిశీలించి, వ్యవసాయ అవసరాలకు వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. భూరుగుపల్లి గ్రామ పంచాయతీలో వర్షపు నీటి సంరక్షణ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను నవీకరిస్తూ నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని, విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, పనుల పురోగతి, రికార్డుల నిర్వహణలో పూర్తి జవాబుదారీతనంతో పనిచేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని సమీకృత ఎస్సీ, బీసీ వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతి, భోజనం, తాగునీరు, పరిశుభ్రత తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీణ, మండల విద్యాధికారి శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి సతీష్, ఏపీఓ, సంబంధిత గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# రబీలో ఆరుతడి పంటల సాగుకు పెద్దపీట

- **ఎల్నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశం**
- **ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాబోయే రబీ సీజన్లో ఎల్నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, నీటి లభ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు నష్టపోకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటల వైపు రైతులను మళ్లించేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రబీ సీజన్ సాగు, వాతావరణ పరిస్థితులపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని సాంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, సాగు పద్ధతులపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆరుతడి పంటలు సాగు చేసే రైతులకు పంట చేతికొచ్చిన తర్వాత మార్కెటింగ్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. పంటల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మద్దతు ధర, గిట్టుబాటు ధరల కల్పనలో జాప్యం జరగకూడదన్నారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేసి రబీ ప్రారంభం నుంచే కొనుగోళ్లు సజావుగా జరిగేలా పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. రైతులు పండించిన పంటకు సరైన ధర లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌళిక వసతులు, గోనె సంచులు తదితర ఏర్పాట్లపై ముందుగానే దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ యార్డుల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడతామని తెలిపారు. ఆరుతడి పంటలు సాగు చేసే రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, గోనె సంచులు వంటి ప్రాథమిక సదుపాయాలకు లోటు లేకుండా చూస్తామని చెప్పారు. వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ రైతులు పండించిన పంటలకు తగిన మద్దతు ధర లభించేలా మార్కెట్ కమిటీ సహకరిస్తుందని వివరించారు. ఈ సమావేశంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యానారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, ఏడీ మార్కెటింగ్ అధికారి గజానన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజా సంక్షేమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల సమత రైస్ మిల్ ను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైస్ మిల్లుకు కేటాయించిన వరి ధాన్యం లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, సిఎంఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. మండలంలోని మద్దికల్ గ్రామాన్ని ఉప తహశీల్దార్ అంజమ్మతో కలిసి సందర్శించి గ్రామంలో చేపట్టే రీ సర్వే ప్రక్రియను ఉదయం సమయంలో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఉద్యోగుల హాజరు పట్టిక, భూభారతి దరఖాస్తుల పరిశీలన, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణ అంశాలను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. భూభారతి దరఖాస్తులను రికార్డులతో సరిచూసి నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. పాఠశాలలోని స్టోర్ గది, వంటగదిని తనిఖీ చేసి, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. దసరా సెలవుల అనంతరం పాఠశాల పునఃప్రారంభమైనందునా పాఠశాలను శుభ్రపర్చాలని, విద్యార్థినులకు పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, ఇతర వైద్య సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# జవహర్నగర్ డంపింగ్ యార్డుపై సమరశంఖం

- **ఈనెల 27 నుంచి ఈటల పాదయాత్ర**
- **25న రౌండ్టేబుల్ సమావేశం**

**ఉద్యమ కెరటం, జవహర్నగర్:** జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పోరుబాట పట్టారు. డంపింగ్ యార్డును తరలించాలని, పరిసర ప్రాంతాల ప్రజలకు కాలుష్యం నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27 నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈనెల 25న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం ఈ ఉద్యమానికి సంబంధించిన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు నుంచి వెలువడే కాలుష్యంతో కీసర, ఘట్కేసర్, దమ్మాయిగూడ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. లీచేట్ కారణంగా చెరువుల్లో చేపలు చనిపోతున్నాయని, ఆరోగ్య సమస్యలపై స్థానికుల్లో ఆందోళన ఉందని తెలిపారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర ఆరోగ్య, పర్యావరణ అధ్యయనం నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. సమస్యను పార్లమెంటులో ప్రస్తావించడంతో పాటు కేంద్ర మంత్రులను కలిశానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన నివేదికలతో ముందుకు రావాలని కేంద్రం సూచించిందన్నారు. చెత్త నిర్వహణకు శాశ్వత పరిష్కారం చూపాలని, అవసరమైతే కేంద్రం సహకారం తీసుకోవాలని కోరారు. బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్రెడ్డి మాట్లాడుతూ జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఈటల రాజేందర్ చేపట్టనున్న పాదయాత్రలో తాము కూడా పాల్గొని డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం పోరాడుతామని ప్రకటించారు. ఈ సన్నాహక సమావేశంలో బీజేపీ సీనియర్ రాష్ట్ర నాయకులు మోహన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎస్.మల్లారెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ గండే, మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు సామా రంగారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.కే. శ్రీనివాస్, మాణిక్ రెడ్డి, తిర్మల్ రెడ్డి, తిరుపతి యాదవ్, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, ఎల్లంపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దేవేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, శామీర్పేట మాజీ ఎంపీపీ శేఖర్ యాదవ్, జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ బాబు, మాజీ ఎంపీటీసీ రషీదా బేగం, కంటోన్మెంట్ అసెంబ్లీ కన్వీనర్ విజయ్ ఆనంద్తో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# శారదాదేవి మండపాలను సందర్శించిన చైర్పర్సన్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణంలోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన శారదాదేవి మండపాలను మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శాంతినగర్, కుమార్పేట్, ద్వారకానగర్, భుక్తాపూర్ తదితర ప్రాంతాల్లో కొలువుదీరిన మండపాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎల్నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు తలెత్తకుండా, రాబోయే రోజుల్లో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మేలు జరగాలని ఆకాంక్షించారు. అవసరమైతే అల్పపీడనాలు, తుపానుల రూపంలోనైనా అనుకూల వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నట్లు పేర్కొన్నారు.

